E KABURU - Digital News Paper

E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 12-02-2026 (వారం) గురువారం సంపుటి: 02 || సంచిక:42 || పేజీలు–6 www.ekaburu.com



అంధుల కోసమే ఈ ఏఐ కళ్లజోడు!

» 3లో

## పట్టణాల్లో ఎక్కువ..
# నగరాల్లో తక్కువ

- పురపాలికల్లో 75.88%... నగరపాలికల్లో 66.05% మొత్తంగా 73% పోలింగ్
- ఓటేసిన వారిలో మహిళలే అధికం
- కార్పొరేషన్లలో అత్యధికంగా నల్గొండలో 77.36%.. అత్యల్పంగా నిజామాబాద్‌లో 59.12%
- మున్సిపాలిటీల్లో చౌటుప్పల్‌లో 91.91%, నందికొండలో 59.68% నమోదు
- చెదురుమదురు ఘటనలు మినహా ఎన్నికలు ప్రశాంతం
- రేపు ఓట్ల లెక్కింపు



**ఈ-కబురు, హైదరాబాద్:** రాష్ట్రంలో పుర ఎన్నికలు ముగిశాయి. చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఎక్కడా రీపోలింగ్ అవసరం లేదని ఎన్నికల సంఘం వెల్లడించింది. బుధవారం రాష్ట్రంలో జరిగిన పుర ఎన్నికల్లో దాదాపు 73.01 శాతం పోలింగ్ నమోదైంది. 2020 మున్సిపల్ ఎన్నికల్లో ఇది 74.40శాతం. శుక్రవారం 138 కేంద్రాల్లో ఓట్లు లెక్కించనున్నారు. 16న కార్పొరేషన్ల మేయర్లు, ఉపమేయర్లు, మున్సిపాలిటీల ఛైర్‌పర్సన్లు, వైస్ ఛైర్‌పర్సన్ల పదవులకు పరోక్ష ఎన్నికలు జరగనున్నాయి.

రాష్ట్ర వ్యాప్తంగా ఏడు నగరపాలక సంస్థల్లోని 412 డివిజన్లు, 116 పురపాలక సంఘాల్లోని 2,569 వార్డుల్లో ఎన్నికలు జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పలు చోట్ల బారులుదీరారు. మొత్తం 52,17,413 మందిలో 38,09,406 మంది ఓటేశారు. పురపాలికల్లో 75.88 శాతం, నగరపాలక సంస్థల్లో 66.05 శాతం మంది ఓటేశారు. అత్యధికంగా 26,67,025 మంది మహిళలల్లో 19,57,226 మంది (73.39శాతం).. 25,49,750 మంది పురుషుల్లో 18,51,829 (72.63 శాతం) మంది.. 638 మంది ఇతరుల్లో 351 మంది (55.02 శాతం) ఓటింగ్‌లో పాల్గొన్నారు.

నగరపాలక సంస్థల్లో అత్యధికంగా నల్గొండలో 77.36 శాతం పోలింగ్ జరగ్గా...అత్యల్పంగా నిజామాబాద్‌లో 59.12 శాతం మంది ఓటేశారు. మొత్తం 2,184 పోలింగ్ కేంద్రాల్లో 10,05,119 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 5,14,475 మంది మహిళలు, పురుషులు 4,90,544 మంది, ఇతరులు 100 మంది ఓట్లు వేశారు.

తరువాయి 2లో

జనగణమన కంటే ముందు తప్పనిసరి..

## 'వందేమాతరం'పై
# కేంద్రం కీలక నిర్ణయం




- కొత్త నిబంధనలు విడుదల చేసిన కేంద్ర హోంమంత్రిత్వ శాఖ
- ప్రభుత్వ కార్యక్రమాలు, పాఠశాలల్లో వందేమాతరం తప్పనిసరి
- అంతరాయం కలిగిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరిక '

ఈకబురు, : వందేమాతరం' గీతాన్ని అన్ని ప్రభుత్వ కార్యక్రమాలు, అన్ని పాఠశాలల్లో తప్పనిసరి చేస్తూ కేంద్ర హోంమంత్రిత్వ శాఖ బుధవారం కొత్త నిబంధనలు తీసుకువచ్చింది. 'జనగణమన' వంటి జాతీయ గీతాల కంటే ముందు దీనిని కచ్చితంగా ఆలపించాలని ఈ నిబంధనలలో పేర్కొంది. వందేమాతర గీతం ఆలపించినప్పుడు అందరూ నిలబడాలని పేర్కొంది.

అన్ని పురస్కారాలు ఇచ్చే సమయంలో, రాష్ట్రపతి హాజరయ్యే అన్ని కార్యక్రమాల్లో వందేమాతరం ఆలపించాలని ఈ నిబంధనల్లో పేర్కొంది.

తరువాయి 2లో




## అడుగడుగునా కాంగ్రెస్ అధికార దుర్వినియోగం: హరీశ్‌రావు

**ఈ కబురు, హైదరాబాద్:** మున్సిపల్ ఎన్నికల్లో.. ముఖ్యమంత్రి మొదలు మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు అడుగడుగునా అధికార దుర్వినియోగానికి, ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు పాల్పడటం దుర్మార్గమని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు.




## జుట్టు కత్తిరింపులో తప్పిదం..

రూ.2 కోట్ల పరిహారం రూ.25 లక్షలకు తగ్గింపు

- సుప్రీంకోర్టు తీర్పు

**ఈ-కబురు, ఢిల్లీ**

ఒక లగ్జరీ హోటల్ సెలూన్‌లో జుట్టు కత్తిరింపులో తలెత్తిన సేవాలోపానికి గాను బాధితురాలికి ప్రకటించిన రూ.2కోట్ల పరిహారాన్ని సుప్రీంకోర్టు రూ.25 లక్షలకు తగ్గించింది. ఈ తీర్పు వెలువరించిన జస్టిస్ రాజేశ్ బిందల్, జస్టిస్ మన్మోహన్ ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. '

# రాష్ట్రంలో ఐఏఎస్‌ల బదిలీలు

- బీసింగరేణి సీఎండీగా జ్యోతిబుద్ధ ప్రకాశ్
- మూడు కార్పొరేషన్లకు స్పెషలాఫీసర్‌గా జయేశ్‌రంజన్
- జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా కర్ణన్ కొనసాగింపు




**ఈ-కబురు, హైదరాబాద్:** ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శి జ్యోతిబుద్ధప్రకాశ్ సింగరేణి బొగ్గు గనుల సంస్థ సీఎండీగా బదిలీ అయ్యారు. సింగరేణి సంస్థ సీఎండీ అదనపు బాధ్యతల నుంచి డి. కృష్ణభాస్కర్‌ను ప్రభుత్వం ఉపసంహరించింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను మూడు ముక్కలుగా విభజించిన ప్రభుత్వం ఈ మూడింటికి ప్రత్యేకాధికారి (స్పెషల్ ఆఫీసర్)గా పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్‌ను నియమించడంతోపాటు, మూడు కార్పొరేషన్లకు ముగ్గురు ఐఏఎస్‌లను కమిషనర్లుగా నియమించింది

తరువాయి 2లో

భారత్..అమెరికా డీల్‌పై మాట మార్చిన వైట్‌హౌస్..

## ఫ్యాక్ట్ షీట్‌లో కీలక సవరణలు



- 500 బిలియన్ డాలర్ల కొనుగోళ్లపై 'నిబద్ధత' పదం 'ప్రయత్నం'గా మార్పు
- పప్పుధాన్యాలపై సుంకాల తగ్గింపు అంశం తొలగింపు
- డిజిటల్ సేవల పన్ను ప్రస్తావనను పూర్తిగా తొలగించిన అమెరికా
- ఈ మార్పులపై ఎలాంటి అధికారిక వివరణ ఇవ్వని వైట్‌హౌస్ '

తరువాయి 2లో




## మున్సిపల్ ఎన్నికలు.. ఓటు హక్కు వినియోగించుకున్న సీఎం రేవంత్

**ఈ కబురు, కొడంగల్:** మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

## పురపోరులో సత్తా చాటుతాం: సీఎం రేవంత్


- మల్లికార్జున ఖర్గేకు తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- మెజారిటీ స్థానాల్లో విజయం సాధిస్తామని వెల్లడి
- అదే ఊపుతో ముందుకెళ్లాలన్న ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే
- రాష్ట్ర రాజకీయాలపై నేతల చర్చ

**ఈ-కబురు న్యూఢిల్లీ:**

రాష్ట్రంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ సత్తా చాటుతుందని, మెజారిటీ స్థానాలను కైవసం చేసుకుంటామని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. దీంతో ఇదే ఊపుతో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లోనూ ముందుకెళ్లాలని ఖర్గే చెప్పారు. బుధవారం ఢిల్లీ వచ్చిన ఆయన నేరుగా తుగ్లక్ రోడ్డులోని అధికార నివాసానికి చేరుకున్నారు

తరువాయి 2లో





## ఐక్యంగా, బలంగా మరో 15 ఏళ్లు కూటమి కొనసాగాలి

- గుజరాత్ తరహాలో ఒకే ప్రభుత్వం ఉంటేనే అభివృద్ధి... ఏపీలోను అదే జరగాలి
- సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ఎన్నికల నాటి కంటే ప్రజా మద్దతు పెరిగింది
- ప్రభుత్వ విజయాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి... ఎమ్మెల్యేలు, మంత్రులు ఓనర్షిప్ తీసుకోవాలి
- కేంద్ర సాయం లేకపోతే ఇన్ని కార్యక్రమాలు సాధ్యం కాదు

కార్యక్రమాలను నేతలకు వివరించిన మఖ్యమంత్రి

తరువాయి 3లో

# అమెరికాకు లొంగిపోయారు

- సిగ్గుగా అనిపించట్లేదా..
- రైతు ప్రయోజనాల పరిరక్షణలో రాజీపడ్డారు
- వాణిజ్య ఒప్పందంపై రాహుల్ గాంధీ నిప్పులు
- దేశాన్ని అమ్మింది కాంగ్రెస్సే: నిర్మల



**ఈ-కబురు, ఢిల్లీ**

: మధ్యంతర వాణిజ్య ఒప్పందం ద్వారా కేంద్ర సర్కారు అమెరికాకు పూర్తిగా లొంగిపోయిందని లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. భారత ఇంధన భద్రతను టోకుగా అప్పగించేశారని (హోల్‌సేల్‌గా సరెండర్ చేశారని), రైతు ప్రయోజనాల పరిరక్షణలో రాజీపడ్డారని ధ్వజమెత్తారు. మోదీ పీకను వారు (అమెరికా) పట్టుకోవడం వల్లనే ఆయన ఈ వాణిజ్య ఒప్పందంలో భారత ప్రయోజనాలను పణంగా పెట్టి లొంగిపోయారని విమర్శించారు. యుద్ధవిద్యల్లో ముందుగా ఇలాగే పట్టుసాధించి, ఆ తర్వాత మెడ బిగించి, ప్రత్యర్థి చేతులెత్తేసేలా చేస్తారని వివరించారు. బుధవారం లోక్‌సభలో కేంద్ర బడ్జెట్‌పై చర్చలో రాహుల్ పాల్గొని ప్రసంగించారు. ''అమెరికాతో వాణిజ్య ఒప్పందం అమల్లోకి వస్తే, ఆ దేశ వ్యవసాయ ఉత్పత్తుల ధాటికి భారత రైతులు విలవిలలాడాల్సి వస్తుంది. వస్త్ర పరిశ్రమ పని అయిపోయినట్టే. ఇకపై భారత్ ఎవరి నుంచి చమురు కొనాలో అమెరికాయే చెబుతుంది. దేశాన్ని ఇలా చేస్తున్నందుకు మీకు సిగ్గుగా లేదా?'' అని విరుచుకుపడ్డారు.

''అంత సులభంగా భారత్‌ను మోదీ అమ్మేస్తారంటే నేను నమ్మను. బహుశా, ఆయనపై ఏదో బయటి ఒత్తిడి ప్రభావం పడి ఉండొచ్చు. ఎప్‌స్టీన్ ఫైల్స్ విడుదలయ్యాయని తెలిసినప్పటి నుంచి ఆయన కళ్లలో భయం స్పష్టంగా కనిపిస్తోంది. ఆ ఒత్తిడి ప్రభావం ఆయనపై పడిందేమో. వాళ్లు ప్రధానిని ఉక్కిరిబిక్కిరి చేసి ఉండొచ్చు. బెదిరించి ఉండొచ్చు. తదుపరి విడతల్లో ఇంకో 30 లక్షలకుపైగా ఎప్‌స్టీన్ ఫైల్స్ విడుదల కావాల్సి ఉంది. గతంలో భారత వస్తు, ఉత్పత్తులపై అమెరికా 3% సుంకాన్నే విధించేది. ఇక నుంచి 18% విధిస్తుందట. అమెరికా సరుకులపై భారత్ విధించే 16% సుంకాన్ని సున్నాకు తగ్గిస్తారట. మోదీ ఇలాంటివన్నీ ఎందుకని ఒప్పుకొన్నారు? ప్రస్తుతం అమెరికా నుంచి భారత్ ఏటా 46 బిలియన్ డాలర్లు ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటోంది. దీన్ని ఏకంగా 146 బిలియన్ డాలర్లు దాటిస్తామని అమెరికాకు ఎందుకు హామీ ఇచ్చారు?'' అని రాహుల్ ప్రశ్నలు సంధించారు.

తరువాయి 2లో

## వందే భారత్ ఛార్జీలు..
## చైనా, జపాన్‌ల కన్నా తక్కువే - రైల్వే మంత్రి



**ఈ-కబురు, ఢిల్లీ :** వందే భారత్ ఏసీ ఛైర్ కార్‌లో ఛార్జీలు అందుబాటు ధరలోనే ఉన్నాయని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. 300-400 కిలోమీటర్ల మధ్య ప్రయాణానికి కిలో మీటరుకు దాదాపు రూ.2.19 మాత్రమే ఛార్జీ వసూలు చేస్తున్నామని అన్నారు. చైనా, జపాన్, ఫ్రాన్స్ దేశాల్లోని ఇటువంటి సర్వీసుల టికెట్ ధర కంటే ఇది తక్కువేనని అన్నారు

తరువాయి 2లో

# రాష్ట్రంలో ఐఏఎస్‌ల బదిలీలు

ఈ మేరకు రాష్ట్రంలో పలువురు ఐఏఎస్, నాన్ ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నైనీ బొగ్గు బ్లాకు ఓవర్‌బర్డన్ తొలగింపునకు సంబంధించి నిర్వహించిన టెండర్లలో అక్రమాలు జరిగాయని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో సింగరేణి సీఎండీగా అదనపు బాధ్యతల్లో ఉన్న కృష్ణభాస్కర్‌ను తప్పించి పూర్తిస్థాయి సీఎండీగా జ్యోతిబుద్ధప్రకాశ్‌ను ప్రభుత్వం నియమించింది. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచీ ఘోష్‌కు ప్రభుత్వం ఎస్సీ అభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా, ఎస్సీల అభివృద్ధి విభాగం కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది.

ఈ రెండు పోస్టుల బాధ్యతల నుంచి జ్యోతిబుద్ధప్రకాశ్‌ను ఉపసంహరించుకుంది. ఎస్టీల అభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా, ఎస్టీల అభివృద్ధి విభాగం కమిషనర్‌గా సబ్యసాచీ ఘోష్‌కు మరో రెండు పోస్టుల్లో కూడా సర్కార్ అదనపు బాధ్యతలు అప్పగించింది. ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాకు ప్రణాళిక శాఖ ముఖ్యకార్యదర్శిగా, తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, డీజీగా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ రెండు పోస్టుల అదనపు బాధ్యతల నుంచి జ్యోతిబుద్ధ ప్రకాశ్‌ను ఉపసంహరించింది. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) సీఈఓ డి.దివ్యకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ పోస్టు అదనపు బాధ్యతల నుంచి శ్రుతి ఓఝాను తప్పించింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ)లో 7 కార్పొరేషన్లు, 20 పురపాలికలను విలీనం చేసి ఏర్పాటు చేసిన కొత్త జీహెచ్‌ఎంసీని ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్లుగా పునర్విభజించిన విషయం తెలిసిందే. కాగా, జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా ఆర్‌వీ కర్ణన్‌ను అదే పోస్టులో కొనసాగిస్తున్నట్టు ప్రభుత్వం తెలిపింది. జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్లు జి.సృజన, టి.వినయ్‌కృష్ణారెడ్డిలను సైబరాబాద్, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్లకు కమిషనర్లుగా బదిలీ చేసింది. సెర్ప్ అదనపు సీఈఓ పి.కాత్యాయినీ దేవిని ప్రజావాణి నోడల్ అధికారిగా బదిలీ చేస్తూ ఆ పోస్టు అదనపు బాధ్యతల నుంచి డి.దివ్యను ప్రభుత్వం ఉపసంహరించుకుంది.

రాష్ట్ర ఆర్థిక సంఘం జేఎండీగా అదనపు బాధ్యతల్లో పి.కాత్యాయినీ దేవి కొనసాగుతారని స్పష్టం చేసింది. హైదరాబాద్ జలమండలి ఈడీని అదే సంస్థ జేఎండీగా బదిలీ చేసింది. పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఓఎస్డీ యు.రఘురామ్‌శర్మను పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శిగా బదిలీ చేసింది. ఆయన మంత్రి శ్రీధర్‌బాబుకు ఓఎస్డీగా అదనపు బాధ్యతల్లో కొనసాగుతారని తెలిపింది.





## పట్టణాల్లో ఎక్కువ.. నగరాల్లో తక్కువ



మొత్తం 116 పురపాలికల్లో 2,569 వార్డుల్లో 28,04,274 ఓట్లు పోలయ్యాయి. మహిళలు 14,42,751 మంది కాగా.. పురుషులు 13,61,285 మంది. ఇతరులవి 238 ఓట్లు ఉన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో 91.91 శాతం.. చండూరులో 91.52 శాతం, సంగారెడ్డి జిల్లా జిన్నారంలో 90.98 శాతం, భువనగిరిలో 90.95 శాతం మేరకు పోలింగ్ జరిగింది. అత్యల్పంగా నల్గొండ జిల్లాలోని నందికొండలో 59.68 శాతం మంది మాత్రమే ఓటేశారు. ఎన్నికల సందర్భంగా పలు చోట్ల స్వల్ప ఘర్షణలు, వాగ్వాదాలు జరిగాయి

## జనగణమన కంటే ముందు తప్పనిసరి..

## 'వందేమాతరం'పై కేంద్రం కీలక నిర్ణయం




- జాతీయ గీతం, గేయం పాడుతుండగా అంతరాయం కలిగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపింది. తాజాగా విడుదల చేసిన నిబంధనల కింద బాధ్యులకు గరిష్ఠంగా మూడేళ్ళ జైలు శిక్ష విధించనున్నట్లు స్పష్టం చేసింది. సినిమా హాల్స్ వంటి ప్రదేశాల్లో కూడా దీనిని తప్పనిసరి చేసింది. ఈ సందర్భాల్లో నిలబడటాన్ని తప్పనిసరి చేయలేదు.
- కేంద్ర ప్రభుత్వం 'వందేమాతరం' 150వ వార్షికోత్సవాలను నిర్వహిస్తోంది. ఈ క్రమంలో ఈ కొత్త నిబంధనలను విడుదల చేసింది. 1937లో తొలగించిన నాలుగు చరణాలతో కలిపి మొత్తం ఆరు చరణాలను పాడాలని కేంద్రం వెల్లడించింది. స్వాతంత్ర పోరాట సమయంలో ముస్లిం లీగ్ అభ్యంతరాల మేరకు నాలుగు చరణాలను తొలగించిన కాంగ్రెస్, రెండు చరణాలను స్వీకరించింది. స్వాతంత్ర్యానంతరం నెహ్రూ ప్రభుత్వం రెండు చరణాలతోనే 'వందేమాతరం'ను జాతీయ గేయంగా ప్రకటించింది.

## మున్సిపల్ ఎన్నికలు.. ఓటు హక్కు వినియోగించుకున్న సీఎం రేవంత్



- వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ జడ్పీ హైస్కూల్‌లో ఆయన ఓటు వేశారు. అనంతరం ఆయన హైదరాబాద్‌కు తిరిగి బయల్దేరారు. కాసేపట్లో ఆయన శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కి చేరుకుని దిల్లీ వెళ్లనున్నారు. మధిర మున్సిపాలిటీ పరిధిలోని 9వార్డు పోలింగ్ కేంద్రంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఓటు హక్కు వినియోగించుకున్నారు. మంచిర్యాలలోని హైటెక్‌సిటీలో 227వ నంబర్ పోలింగ్ బూత్‌లో మంత్రి వివేక్ ఓటు వేశారు.

# అమెరికాకు లొంగిపోయారు



డాలరు పెత్తనాన్ని సవాల్ చేయాలి

"అమెరికా ఆధిపత్యాన్ని, డాలరు పెత్తనాన్ని సవాల్ చేయాలి. ఒకే సూపర్ పవర్ ఉండాలనే దానికి అంగీకరించకూడదు. ఇంధన వనరులు, ఆర్థిక వనరులను ఆయుధాలుగా మలిచి భారత్‌పైకి ప్రయోగించే అవకాశాన్ని అమెరికాకు మోదీ సర్కారు ఇచ్చింది. భారత్ ఎవరి నుంచి ముడి చమురును కొనాలనేది, మరో దేశం నిర్ణయించాలా? భారత ప్రయోజనాలను దెబ్బతీసే ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నందుకు సిగ్గుగా లేదా? మేమైతే ఇలా చేయం. దీనిపై సభకు వచ్చి ఎలా సమర్థించుకుంటారు?" అని రాహుల్ మండిపడ్డారు.

అమ్మింది మోదీ కాదు కాంగ్రెస్సే: ఆర్థిక మంత్రి

బడ్జెట్‌పై దిగువసభలో చర్చకు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ స్పందిస్తూ.. దేశాన్ని అమ్మింది కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీయే సర్కారే తప్పిస్తే మోదీ కాదని చెప్పారు. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో) వంటివాటికి పేదల, రైతుల ప్రయోజనాలను అమ్మేసింది కూడా ఆ పార్టీయేనన్నారు. "దేశాన్ని అమ్మడానికి, కొనడానికి ఎవరూ సాహసం చేయలేరు. అలాంటి వారు ఇంతవరకు పుట్టలేదు. ప్రధాని అలాంటిది ఎప్పుడూ చేయబోరు" అని స్పష్టంచేశారు. బడ్జెట్లో కేటాయింపులను చదవకుండా ఆయా రంగాలపై ఆరోపణలు చేస్తున్నారంటూ గణాంకాలతో తిప్పికొట్టారు.

ఎప్‌స్టీన్ ఫైల్స్ గురించి రాహుల్ ప్రస్తావించడంపై స్పీకర్ స్థానంలో ఉన్న జగదాంబికా పాల్ అభ్యంతరం వ్యక్తంచేశారు. 'మీరు నా మాట వినిఉంటే విపక్షంలో కూర్చొనేవారు కాదు. బడ్జెట్‌తో సంబంధం లేనివాటిని లేవనెత్తరాదు. సరైన ట్రాకులో ఉన్నప్పుడు పట్టాలు తప్పకండి. మీకు ఇంకా సమయం ఉంది. సరైన ట్రాకుకు వెళ్లండి' అని రాహుల్‌కు సూచించారు. పాల్ తమ పార్టీ మాజీ సభ్యుడైనందువల్ల తాను ఈరోజు దూకుడుగా వెళ్లనని రాహుల్ చెప్పారు. అదానీ, అనిల్ అంబానీ, హర్దీప్‌సింగ్ పురీ పేర్లను రాహుల్ ప్రస్తావించడంపై రవిశంకర్ ప్రసాద్ పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తారు. దీంతో రాహుల్ వ్యాఖ్యల్లో కొన్నింటిని రికార్డుల నుంచి తొలగించారు.

రాహుల్‌పై సభా హక్కుల తీర్మానం పెడతాం!

దేశం అభివృద్ధిపథంలో ఉండడాన్ని కాంగ్రెస్ ఓర్చుకోలేకపోతోందని.. అందువల్లే ఆ పార్టీ నేతలు ఆధారాలు లేకుండా ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు విమర్శించారు. అమెరికాకు మేలు కలిగించేలా వాణిజ్య ఒప్పందం ఉందనేందుకు ఆధారాలు చూపాలని రాహుల్‌కు సవాల్ విసిరారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడి స్థానానికి తగిన నేత కాంగ్రెస్‌లో లేకపోవడం దురదృష్టకరమన్నారు. సభను తప్పుదోవ పట్టిస్తున్నందుకు, నిరాధార ఆరోపణలు చేస్తున్నందుకు విపక్ష నేతపై సభా హక్కుల తీర్మానం ప్రవేశపెడతామని చెప్పారు.

వివిధ అంశాలపై విపక్షాల నిరసనల మధ్యనే లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయం కొనసాగింది. నిరసనల తర్వాత విపక్ష సభ్యులు వాకౌట్ చేశారు. తర్వాత పార్లమెంటు ఆవరణలో నినాదాలిచ్చారు.

## పురపోరులో సత్తా చాటుతాం: సీఎం రేవంత్



సాయంత్రం 7 గంటల సమయంలో రాజాజీ మార్గ్‌లోని ఖర్గే నివాసంలో ఆయనతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. సీఎం వెంట ఎంపీలు మల్లు రవి, అనిల్‌కుమార్ యాదవ్ ఉన్నారు. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులు, మున్సిపల్ ఎన్నికలు, విజయావకాశాలపై సుమారు 30 నిమిషాల పాటు నేతలు చర్చించారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలు, రైతు రుణమాఫీ వంటి అంశాలు ప్రజల్లోకి బలంగా వెళ్లాయని, మున్సిపల్ ఎన్నికల్లో ఈ అంశాలు పార్టీకి కలిసివస్తాయని రేవంత్ వివరించారు. 70 శాతానికిపైగా స్థానాల్లో విజయం సాధిస్తామని, మెజారిటీ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను కైవసం చేసుకుంటామని చెప్పారు. గెలిచిన మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్ చైర్మన్ల పదవుల్లో బీసీ సామాజిక వర్గం, మహిళలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణపై కూడా ఖర్గే, రేవంత్ చర్చించినట్లు సమాచారం. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలపై మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని సీఎం చెప్పినట్లు సమాచారం. ఈ సందర్భంగా కొద్దిసేపు ఖర్గే, రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా సమావేశం అయినట్లు తెలిసింది.

బీఆర్‌ఎస్, బీజేపీ పట్ల అప్రమత్తంగా ఉండండి

ఇటీవల రాజకీయ, పాలనా పరమైన అంశాలు బయటకు రావడంపై ఇద్దరు నేతల మధ్య చర్చ జరిగినట్లు తెలిసింది. పార్టీ యంత్రాంగం, ప్రభుత్వం మధ్య సమన్వయం దెబ్బతినకుండా చూసుకోవాలని, నేతల మధ్య విభేదాలు ఉన్నా వాటిని వెంటనే పరిష్కరించుకోవాలని రేవంత్‌కు ఖర్గే హితబోధ చేసినట్లు సమాచారం. అదే సమయంలో బీఆర్‌ఎస్, బీజేపీ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఖర్గే సూచించారు. ఒకవైపు బీఆర్‌ఎస్ వైఫల్యాలను ఎండగడుతూనే, మరోవైపు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు చేస్తున్న అన్యాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలంటూ ఖర్గే దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది.

నేడు కేంద్ర మంత్రులతో భేటీ

ఢిల్లీ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి గురువారం రాష్ట్రానికి సబంధించిన పలు అంశాలపై పలువురు కేంద్ర మంత్రులతో భేటీ కానున్నట్లు తెలిసింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జల వనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్, రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డా, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, ఆహార పంపిణీ శాఖ మంత్రి ప్రల్హాద్ జోషిని కలిసి అవకాశం ఉందని తెలుస్తోంది. పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతోనూ భేటీ కానున్నట్లు సమాచారం.

## భారత్-అమెరికా డీల్‌పై మాట మార్చిన వైట్‌హౌస్.. ఫ్యాక్ట్ షీట్‌లో కీలక సవరణలు



భారత్‌అమెరికా మధ్య కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై విడుదల చేసిన అధికారిక ఫ్యాక్ట్‌షీట్‌లో వైట్‌హౌస్ నిశ్శబ్దంగా కీలక మార్పులు చేసింది. ఒప్పంద వివరాలు వెల్లడించిన కొన్ని రోజులకే ఈ సవరణలు చేయడం చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా, భారత్ కొనుగోళ్లకు సంబంధించిన పదజాలాన్ని మార్చడంతో పాటు, కొన్ని వ్యవసాయ ఉత్పత్తులు, డిజిటల్ పన్నుల ప్రస్తావనను తొలగించింది.

తొలుత విడుదల చేసిన ఫ్యాక్ట్‌షీట్‌లో, అమెరికా నుంచి 500 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు భారత్ "నిబద్ధతతో ఉంది" (committed to buy) అని పేర్కొన్నారు. అయితే, సవరించిన వెర్షన్‌లో ఈ పదాన్ని "కొనుగోలు చేయాలని భావిస్తోంది" (intends to buy) అని మార్చారు. ఒప్పందంపై భారత్ వైపు నుంచి ఉన్న కట్టుబాటు తీవ్రతను ఈ మార్పు తగ్గించేలా ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

దీంతో పాటు, అమెరికా నుంచి దిగుమతి చేసుకునే ఉత్పత్తులపై భారత్ సుంకాలు తగ్గిస్తుందన్న జాబితా నుంచి "కొన్ని రకాల పప్పుధాన్యాలు" అనే పదాన్ని తొలగించారు. ఇది భారత రైతులకు సంబంధించిన సున్నితమైన అంశం కావడంతో ఈ మార్పు ప్రాధాన్యం సంతరించుకుంది. అదేవిధంగా, భారత్ తన డిజిటల్ సేవల పన్నును తొలగిస్తుందన్న వాక్యాన్ని కూడా ఫ్యాక్ట్‌షీట్ నుంచి పూర్తిగా తొలగించడం గమనార్హం.

ఈ మార్పులను వైట్‌హౌస్ తన అధికారిక వెబ్‌సైట్‌లో ఎలాంటి ప్రకటన లేకుండా చేసింది. ఈ సవరణలకు గల కారణాలపై అమెరికా ప్రభుత్వం నుంచి ఎటువంటి అధికారిక వివరణ రాలేదు. దీంతో ఒప్పందంలోని అంశాలపై ఇరు దేశాల మధ్య అవగాహన విషయంలో స్పష్టత లోపించిందనే వాదనలు వినిపిస్తున్నాయి.

## వందే భారత్ ఛార్జీలు.. చైనా, జపాన్‌ల కన్నా తక్కువే .. రైల్వే మంత్రి

ఆయా దేశాల్లో కిలోమీటరుకు రూ.7 నుంచి రూ.20 వరకు వసూలు చేస్తున్నారని చెప్పారు. ఈ మేరకు లోక్‌సభలో సభ్యుడు అడిగిన ప్రశ్నకు రైల్వే మంత్రి లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు.

--పొరుగు దేశాలతో పోల్చినా..

పొరుగు దేశాల రైల్వేల్లో సాధారణ తరగతులతో పోలిస్తే మనదగ్గరే ఛార్జీలు తక్కువని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. భారత్‌లో కిలోమీటరుకు ఛార్జీ 20 పైసలుగా ఉండగా.. పాకిస్థాన్‌లో 54 పైసలు, బంగ్లాదేశ్‌లో 37 పైసలు, శ్రీలంకలో 51 పైసలుగా ఉందన్నారు. వివిధ వర్గాల ప్రయాణికుల సేవలకు టికెట్ ధరలను నిర్ణయించేటప్పుడు.. సేవలకు అయ్యే ఖర్చు, అందిస్తున్న సదుపాయాలు, ప్రయాణికుల స్తోమత, ఇతర రవాణా సదుపాయాల్లో ఉన్న ఛార్జీలు, సామాజికఆర్థిక అంశాలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. 2019 ఫిబ్రవరిలో వందే భారత్ సర్వీసులు ప్రారంభించామని, ప్రస్తుతం దేశవ్యాప్తంగా 82 రూట్‌లలో 164 సర్వీసులు సేవలందిస్తున్నాయని చెప్పారు. ప్రయాణికుల సర్వీసు విభాగంలో ఈ రైళ్లు ఎంతో ప్రత్యేకమైనవన్నారు. సస్పెన్షన్ సిస్టమ్, వేగం, ఆటోమేటిక్ ప్లగ్ డోర్లు, సౌకర్యవంతమైన సీట్లు, మినీ ప్యాంట్రీ, సీసీ టీవీలు, కవచ్ (KAVACH) వంటి అత్యాధునిక వ్యవస్థలు ఈ రైళ్లలో ఉన్నాయన్నారు. ప్రయాణికుల స్తోమతను దృష్టిలో ఉంచుకొని ఈ రైళ్లలో ఛార్జీలను తక్కువగా ఉండేలా చూసుకున్నామని రైల్వే మంత్రి వెల్లడించారు.



# జుట్టు కత్తిరింపులో తప్పిదం..

## రూ.2 కోట్ల పరిహారం రూ.25 లక్షలకు తగ్గింపు



ఈ కేసులో సేవాలోపం స్పష్టం. వినియోగదారుల వివాదాల్లో పరిహారం ప్రత్యక్ష సాక్ష్యాల ఆధారంగా ఉండాలి. బాధితులు అడిగారనో లేదా ఇష్టాయిష్టాల ప్రకారం పరిహారాన్ని నిర్ణయించడం తగదు. అందులోనూ పరిహారం రూ.కోట్లలో ఉన్న వ్యాజ్యాల్లో సహేతుకమైన, విశ్వసనీయమైన ఆధారాలు చాలా ముఖ్యం' అని ధర్మాసనం పేర్కొంది. కేవలం బాధితురాలు సమర్పించిన ఫొటోల ఆధారంగానే జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ (ఎన్‌సీడీఆర్‌సీ) భారీ పరిహారం నిర్ణయించడం సరికాదని తెలిపింది. ఆశ్నారాయ్ అనే మేనేజ్‌మెంట్ ప్రొఫెషనల్ 2008 ఏప్రిల్‌లో దిల్లీలోని ఐటీసీ మౌర్య హోటల్ సెలూన్‌లో హెయిర్‌కట్ చేయించుకున్నారు. తాను సూచించిన దానికన్నా పొట్టిగా జుట్టును కత్తిరించడంతో తీవ్ర మానసిక వేదనకు గురయ్యానని, మోడలింగ్ అవకాశాలను కోల్పోయానని పేర్కొంటూ ఆమె ఎన్‌సీడీఆర్‌సీని ఆశ్రయించారు. బాధితురాలికి రూ.2కోట్లను పరిహారంగా చెల్లించాలన్న ఎన్‌సీడీఆర్‌సీ నిర్ణయాన్ని ఐటీసీ మౌర్య హోటల్ సవాల్ చేయగా తాజా తీర్పు వెలువడింది.

**అస్సాం సీఎంపై విద్వేష ప్రసంగాల ఆరోపణ.. విచారణకు సుప్రీం సమ్మతి**

అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ఆ రాష్ట్రంలోని ముస్లింలకు వ్యతిరేకంగా విద్వేష ప్రసంగాలు చేస్తున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సుప్రీంకోర్టులో మరో వ్యాజ్యం దాఖలైంది. మాజీ ప్రొఫెసర్ హిరేన్ గోహెన్, మాజీ డీజీపీ హరేకృష్ణ, సీనియర్ పాత్రికేయుడు పరేశ్ చంద్ర మలాకర్, సీనియర్ న్యాయవాది శాంతను బర్తాకుర్ సంయుక్తంగా ఈ పిటిషన్ వేశారు. ఈ కేసు విచారణ తేదీని నిర్ణయిస్తామని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం వెల్లడించింది. వామపక్ష పార్టీల నేతలు కూడా మంగళవారం ఇటువంటి పిటిషనే దాఖలు చేశారు.

**వినియోగదారుల వివాదాలనూ హైకోర్టులే పరిష్కరించాలి**

వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్లలో కేసులు తక్కువగా పెండింగ్‌లో ఉన్న రాష్ట్రాలకు సంబంధించి సుప్రీంకోర్టు బుధవారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. అలాంటి రాష్ట్రాల్లో హైకోర్టులే ఆయా పిటిషన్లపై విచారణ చేపట్టాలని ఆదేశించింది. వినియోగదారుల కేసులు ఎక్కువగా లేనప్పటికీ రాష్ట్ర స్థాయి కమిషన్లను కొనసాగించడం వల్ల ప్రభుత్వ ఖజానాపై అనవసర భారం పడుతుందని వ్యాఖ్యానించింది. దాన్ని నివారించడం కోసం.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద తమకు దఖలు పడిన విశేషాధికారాలను ఉపయోగించుకుంటూ తాజా ఆదేశాలు జారీ చేస్తున్నట్లు భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీల ధర్మాసనం తెలిపింది. వినియోగదారుల పరిరక్షణ చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా ప్రస్తుతం వినియోగదారుల వివాదాల పరిష్కారం కోసం మూడంచెల కమిషన్లు (జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో) ఉన్నాయి. అయితే తమ జిల్లా, రాష్ట్ర స్థాయి కమిషన్లలో కేసులు చాలా తక్కువగా ఉన్నాయని.. కొన్ని వినియోగదారుల కోర్టులైతే ఏడాది కంటే ఎక్కువ కాలం పనిచేయకుండా ఖాళీగా ఉన్నాయని పలు రాష్ట్రాలు దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ నిర్వహించింది. ప్రజాధనాన్ని కాపాడేందుకు.. ఆయా రాష్ట్ర స్థాయి వినియోగదారుల కమిషన్లలోని పిటిషన్ల విచారణ బాధ్యతను హైకోర్టులకు అప్పగిస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. ఇందుకోసం అనుభవజ్ఞులైన సింగిల్ జడ్జికి వాటి పరిష్కార బాధ్యతను అప్పగించాలని హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులను ఆదేశించింది. కేసులు తక్కువగా పెండింగ్‌లో ఉన్న జిల్లా స్థాయి కమిషన్ల విషయంలో ఉత్తర్వులు జారీ చేసేందుకు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సహాయాన్ని న్యాయస్థానం కోరింది. తమ జిల్లా, రాష్ట్ర స్థాయి వినియోగదారుల కమిషన్లలో కేసులు చాలా స్వల్ప సంఖ్యలో పెండింగులో ఉన్నట్లు అరుణాచల్ ప్రదేశ్, మణిపుర్, గోవా, మిజోరం, నాగాలాండ్, హిమాచల్ ప్రదేశ్, అండమాన్ నికోబార్ దీవులు, మేఘాలయ రాష్ట్రాలు సుప్రీంకోర్టుకు నివేదించాయి.

**బెయిలు కోరే నిందితులు.. తమ నేరచరిత్రను తప్పనిసరిగా తెలియజేయాలి**

బెయిలు కోసం దరఖాస్తు చేసుకునే ప్రతి నిందితుడు/నిందితురాలు తమ నేరచరిత్రను కోర్టుకు ప్రమాణపత్రం రూపంలో తప్పనిసరిగా తెలియజేయాలని సుప్రీంకోర్టు బుధవారం ఆదేశించింది. బెయిలు మంజూరులో పారదర్శకత, ఏకరూపకతను ప్రోత్సహించేందుకు ఇది దోహదపడుతుందని పేర్కొంది. గతంలో నేరాలు చేసి ఉండటం, ప్రస్తుతం తమపై నాన్ బెయిలబుల్ వారెంట్లు ఉండటం వంటి వివరాలన్నీ నిందితులు ప్రమాణపత్రంలో వెల్లడించాల్సిందేనని స్పష్టం చేసింది. గత నేరాలకు సంబంధించి ఎఫ్ఐఆర్ నంబరు, కేసు నమోదైన పోలీసు స్టేషన్ వివరాలు, దర్యాప్తు అధికారి మోపిన సెక్షన్లు, వాటికి పడే గరిష్ఠ శిక్షలు తదితర వివరాలు అందులో తెలపాలని పేర్కొంది. న్యాయవాదులకు నకిలీ డిగ్రీ సర్టిఫికెట్లను జారీ చేసిన ఓ వ్యక్తికి అలహాబాద్ హైకోర్టు మంజూరు చేసిన బెయిలును రద్దు చేస్తూ.. జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం ఈ మేరకు మార్గదర్శకాలు విడుదల చేసింది.

## అడుగడుగునా కాంగ్రెస్ అధికార దుర్వినియోగం: హరీశ్‌రావు



నామినేషన్ల దాఖలు మొదలు పోలింగ్ వరకూ కాంగ్రెస్ అనేక అరాచకాలకు పాల్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆక్షేపించారు. బీఆర్ఎస్ అభ్యర్థులను బెదిరించడం, వారిపై భౌతిక దాడులకు తెగబడటం హేయమైన రాజకీయ సంస్కృతికి నిదర్శనమని విమర్శించారు. చట్టాన్ని లెక్కచేయకుండా అధికార పార్టీ నాయకుల అడుగులకు మడుగులొత్తిన కొందరు పోలీసుల తీరు గర్హనీయమని ఖండించారు. ఎన్నికల్లో గెలుపు కోసం కాంగ్రెస్ ఇలాంటి నీచ రాజకీయాలకు తెగబడటం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని అన్నారు. కాంగ్రెస్ కుట్రలు, కుతంత్రాలు, డబ్బు సంచులు, దుష్ట పన్నాగాలు ప్రజల తీర్పును ఏమాత్రం ప్రభావితం చేయలేవని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. అధికార పార్టీ అకృత్యాలకు అదరకుండా, బెదరకుండా బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం చివరి వరకు కృషి చేసిన పార్టీ శ్రేణులకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్‌పై విశ్వాసంతో ఓటు వేసిన ప్రతి ఓటరుకు ధన్యవాదాలు చెప్పారు.

## అంధుల కోసమే ఈ ఏఐ కళ్లజోడు!



**పుస్తకాన్ని చదువుతున్న అంధవ్యక్తి**

ఈ కబురు, బెంగళూరు: అంధుల నిత్యావసరాలను తీర్చేలా బెంగళూరుకు చెందిన నారాయణ నేత్రాలయ, ఎస్‌హెచ్‌జీ టెక్నాలజీలు స్మార్ట్ విజన్ గ్లాసెస్ అల్ట్రా కళ్లజోళ్లను తయారు చేశాయి. ఈ కళ్లజోడు ద్వారా అంధులు తమ ముందు కనిపించే వస్తువులు, పుస్తకాల్లోని అక్షరాలు, వెళ్లే మార్గాలను సులువుగా తెలుసుకుంటారు. ఈ కళ్లజోళ్లలోని లైడార్ (లైట్ డిటెక్షన్ అండ్ రేంజింగ్) సెన్సార్లు పరిసరాలకు సంబంధించిన వివరాలను స్కాన్ చేసి బ్లూటూత్ ద్వారా వ్యక్తికి వినిపించేలా చేస్తాయి. ఈ ఆవిష్కరణ గురించి నారాయణ నేత్రాలయ బడ్స్ అండ్ బ్లూజమ్స్ విభాగం ఆప్టొమెట్రిస్ట్ డాక్టర్ మహ్మద్ డ్యానిష్ మాట్లాడుతూ ఐదేళ్లుగా మా వద్దకు వచ్చే అంధులను పరీక్షించి, వారికి రోజువారీగా కనీస అవసరాలను సిద్ధం చేసి వాటిని ఈ కళ్లజోడులోని కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత ద్వారా అందించే ఏర్పాటు చేశామన్నారు. వందశాతం చూపులేని వారికి కూడా ఈ స్మార్ట్ కళ్లజోడు ఉపయోగపడుతుందన్నారు. "మొత్తం 18 భారతీయ భాషలు, కొన్ని విదేశీ భాషలను ఈ కళ్లజోడు ద్వారా చదవగలరు. వస్తువులు, వ్యక్తుల ముఖాలు, కరెన్సీ నోట్లను ఇందులోని ఏఐ సాంకేతికత ద్వారా గుర్తించగలరు. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే స్మార్ట్ కళ్లజోడుతో పోలిస్తే ఈ గ్లాసులు తక్కువ ధరలకే అందుబాటులో ఉంటాయి" అని వివరించారు.

# ఐక్యంగా, బలంగా మరో 15 ఏళ్లు కూటమి కొనసాగాలి

ఈ కబురు; రాష్ట్రంలో మరో 15 ఏళ్ల పాటు కూటమి ఐక్యత ఇలాగే కొనసాగాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ 20 నెలల్లో కూటమి నాయకత్వంలో ఎక్కడా విభేదాలు ఏర్పడలేదని, ఇది శుభ పరిణామమని చెప్పిన సీఎం ఇదే ఐక్యత ఇకపైనా కొనసాగాలని, అప్పుడే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఇందుకు తగ్గట్టుగా మంచి పనులు చేసి ఎమ్మెల్యేలు పేరు తెచ్చుకోవాలన్నారు. మొన్నటి ఎన్నికల కంటే నేడు కూటమి బలం, ప్రజల మద్దతు మరింత పెరిగిందని... ఎన్నికల ముందు ఏ స్ఫూర్తితో పనిచేశామో, అదే స్ఫూర్తితో మున్ముందు పని చేయాలన్నారు. మూడు పార్టీలు ఐక్యంగా ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడిగే పరిస్థితి ఉండాలన్నారు. అసెంబ్లీ కమిటీ హాలులో ఎన్డీఏ శాసనసభా పక్ష ఎమ్మెల్యేలు, శాసనమండలి సభ్యులతో ముఖ్యమంత్రి సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ నిబద్ధతో పనిచేయాలని ముఖ్యమంత్రి సూచించారు. గుజరాత్‌లో వరుసగా ఐదుసార్లు బీజేపీ గెలిచి అధికారంలో ఉందని, ఇదే స్ఫూర్తితో ఇక్కడా విజయాలు సొంతం చేసుకోవాలన్నారు. శాశ్వతంగా రాజకీయాల్లో నిలబడేలా అందరూ మంచి పేరు తెచ్చుకోవాలని సీఎం సూచించారు. ఈ 20 నెలల్లో చాలా కష్టపడి, ఐక్యంగా పని చేశామని సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. వైసీపీ ఐదేళ్ల ఏళ్ల విధ్వంసాన్ని అధిగమించి... ప్రగతి వైపు రాష్ట్రాన్ని తీసుకువెళుతున్నామన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం 15 ఏళ్లు కూటమి కలిసి ఉంటుందని, ఐక్యంగా ముందుకు వెళతుందని డిప్యూటీ సీఎం చెప్పారు. ఎన్నికల్లో ఏ స్ఫూర్తితో పనిచేశామో... భవిష్యత్‌లో అలాగే పని చేయాల్సి ఉంటుందన్నారు. పార్టీల మధ్య భిన్నాభిప్రాయాలు ఉంటే అంతర్గతంగా కూర్చుని వాటిని పరిష్కరించుకోవాలని పవన్ కళ్యాణ్ చెప్పారు. కూటమి ధర్మాన్నికి ప్రతి ఒక్కరం కట్టుబడి బడి పని చేయాలని సూచించారు.

--అర్థవంతమైన చర్చలు జరగాలి

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... 'జిల్లాల వారీగా ఎమ్మెల్యే, ఎంపీలు, ఎస్పీ, కలెక్టర్లతో ఉమ్మడి సమావేశం నిర్వహిస్తాం. పొలిటికల్ గవర్నెన్స్‌లో భాగంగా ఎమ్మెల్యేల గౌరవాన్ని పెంచుతాం. నియోజకవర్గాల్లో పెండింగ్ పనులు గుర్తిస్తే ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేద్దాం. మనం చేసే అభివృద్ధి కార్యక్రమాలు ఫలితాలను ఇస్తున్నాయి. మనం ఇంకా పూర్తిగా కోలుకోలేదు... కానీ వ్యవస్థలను గాడిన పెట్టాం. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయా నియోజకవర్గాల్లో చేసిన పనులను ఎమ్మెల్యేలు ఓన్ చేసుకోవాలి. అసెంబ్లీ సమావేశాలను సభ్యులు సీరియస్‌గా తీసుకోవాలి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సభ్యులు అంతా సభలో ఉండాల్సిందే. నేను కూడా సభను పూర్తిగా ఫాలో అవుతా... సభ్యుల ప్రసంగాలు, మంత్రులు సమాధానాలు వింటాను. సభలో సబ్జెక్టులపై అర్థవంతమైన చర్చలు జరగాలి. మా సమస్యలపై మా ఎమ్మెల్యేలు మాట్లాడారు, మంత్రులు సమాధానం చెప్పారు అని ప్రజలు అనుకోవాలి. విప్‌లు సంతృప్తికరంగా పని చేయాలి. ఎదుటివారు తిట్టారని మనం కూడా బూతులు తిట్టకూడదు. ప్రజల ఆమోదయోగ్యంగా సభ జరగాలి.' అని సీఎం చంద్రబాబు అన్నారు.

--కేంద్ర సాయంతోనే ఇంతటి పురోగతి

'నాడు ఎన్నికల్లో చెప్పిన అన్ని పథకాలు ఇస్తున్నామంటే కేంద్రం ఎంతో సహకారం అందిస్తోంది. అందుకే వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని గాడిన పెట్టాం. కేంద్రం అమరావతి, పోలవరానికి డబ్బులు ఇవ్వకపోయి ఉంటే నేడు ఈ ప్రాజెక్టులు ప్రారంభం అయ్యేవి కాదు. 2027 జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి జాతికి అంకిత చేస్తున్నామంటే కేంద్రం సాయం అందించడమే కారణం. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కేంద్ర సాయంతో నిలబెట్టాం. మన ప్రజల కోసం, మన రాష్ట్రం కోసం, మన విశాఖ కోసం కేంద్రం తన పాలసీనే మార్చుకుని సాయం చేసింది. ఇది చిన్న విషయం కాదు. కేంద్ర సాయంతో మొదటిసారిగా ఒక్క నెలలో రూ.54 కోట్ల లాభాలను విశాఖ స్టీల్ ప్లాంట్ సాధించింది. ఇదే స్థాయిలో పని చేస్తే అత్యుత్తమ ప్రాజెక్టుగా నిలుస్తుంది. సూపర్ సిక్స్‌తో సహా అన్ని సంక్షేమ పథకాలను అందిస్తున్నాం... కేంద్రం సహకారం వల్లనే ఇవన్నీ సాధ్యం అవుతున్నాయి. ప్రభుత్వ కార్యక్రమాలపై ఎమ్మెల్యేలు ఓనర్ షిప్ తీసుకోవాలి' అని సీఎం చంద్రబాబు అన్నారు.


--నాడు అధికారంలో వైసీపీ అరాచకాలు

ఎన్డీఏఎల్పీ సమావేశంలో పాల్గొన్న వారిలో 90 శాతం మంది నాటి వైసీపీ ప్రభుత్వ బాధితులేనని సభ్యుల్ని ఉద్దేశించి ముఖ్యమంత్రి అన్నారు. నేడు నీతులు చెబుతున్న వైసీపీ నేతలు... నాడు అధికారంలో చేసిన అరాచకాలను మరిచిపోయారని విమర్శించారు. వాళ్ల హయాంలో పవన్ కల్యాణ్ విశాఖ వెళితే కనీసం కారు కూడా దిగనివ్వలేదన్నారు. హోటల్ గది నుంచి బయటకు రానివ్వకుండా అడ్డుపడ్డారని సీఎం చెప్పారు. తన అరెస్టు సమయంలో మద్దతుగా పవన్ కల్యాణ్ హైదరాబాద్ నుంచి వస్తుంటే... ఆయనకు అనేక అడ్డంకులు సృష్టించారని సీఎం అన్నారు. విమానంలో వచ్చే అవకాశం లేకుండా చేశారని, రోడ్డు మార్గాన కూడా రానివ్వలేదన్నారు. ఇలా అనేక సవాళ్లను, ఇబ్బందులను ఎదిరించి కూటమి ఐక్యంగా నిలబడి ఎన్నికల్లో గెలిచిందని సీఎం వివరించారు.

--20 నెలల పాలనలో ఎన్నో విజయాలు

రాష్ట్రంలో ప్రతీ రంగంలోనూ వృద్ధి నమోదైందని, విధ్వంసం నుంచి వికాసం వైపు పురోగతి సాధిస్తోందని ముఖ్యమంత్రి చెప్పారు. కూటమి ప్రభుత్వం 20 నెలల పాలనలో సాధించిన విజయాలు, చేపట్టిన అభివృద్ధిసంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. అతి తక్కువ కాలంలో ప్రజలు మెచ్చే పాలన అందించామని... ప్రజావసరాలను గుర్తించి నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు. ఈ సందర్భంగా 20 నెలల కాలంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన వివిధ సంక్షేమఅభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి ఈ సమావేశంలో వివరించారు. ప్రతి ఎమ్మెల్యే, మంత్రి ఈ విజయాలను, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని, ఓనర్షిప్ తీసుకోవాలని అన్నారు. 20 నెలల్లో ప్రభుత్వం అమలు చేసిన ప్రధాన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వివరాలు ఇలా ఉన్నాయి...:

1. తల్లికి వందనం : రూ.10,090 కోట్లు తల్లుల ఖాతాల్లో జమ. 67.27 లక్షల మంది విద్యార్థులకు సాయం
2. స్త్రీ శక్తి : 43.51 కోట్లకు పైగా ఉచిత బస్సు ప్రయాణాలు... రూ.1,532 కోట్లు ఖర్చు.
3. దీపం 2 పథకం : రాష్ట్రంలోని 1.08 కోట్ల కుటుంబాలకు ఏడాదికి ఉచితంగా 3 సిలిండర్ల పంపిణీ. ఇప్పటికి 3.64 కోట్ల సిలిండర్లు అందజేత. ఇందుకు రూ.2,891 కోట్లు వ్యయం
4. అన్నదాత సుఖీభవ : 46.86 లక్షల మంది రైతులకు ఏడాదికి మూడు విడతల్లో రూ.20 వేల చొప్పున సాయం... ఇప్పటికి రెండు విడతల్లో రూ.6,310 కోట్లు జమ
5. ఎన్టీఆర్ భరోసా : ప్రతి నెలా 63 లక్షల మందికి పింఛన్లు. ఇప్పటికి రూ.58,654 కోట్లు వ్యయం. దేశంలో అత్యధిక మొత్తంలో, అత్యధిక మందికి పింఛన్లు ఇస్తున్న రాష్ట్రంగా రికార్డు.
6. దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం... వీరు ఎక్కడైనా పింఛను తీసుకునే అవకాశం.
7. మత్స్యకార భరోసా : ఏడాదికి రూ.20 వేల చొప్పున 1.25 లక్షల మందికి రూ.250 కోట్లు.
8. నేతన్నలకు ఉచిత విద్యుత్ : మర మగ్గాలకు నెలకు 500, మగ్గాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్.. లక్షకు పైగా చేనేతల కుటుంబాలకు లబ్ధి.
9. ఆటో డ్రైవర్ల సేవలో : ఏడాదికి రూ.15,000. రూ.436 కోట్లు జమ, 2.90 లక్షల మందికి లబ్ధి
10. అన్నా క్యాంటీన్ : రాష్ట్రవ్యాప్తంగా 113 నియోజకవర్గాల్లో 205 అన్న క్యాంటీన్లు, అన్న క్యాంటీన్ ద్వారా 7.50 కోట్ల భోజనాలు
11. గీత కార్మికులకు 10 శాతం మద్యం షాపుల కేటాయింపు స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు
12. వివాదాలకు తావివ్వకుండా ఎస్సీ వర్గీకరణ... అన్ని వర్గాలకు సమన్యాయం
13. 8,427 మంది పాస్టర్లకు నెలకు రూ.5,000 చొప్పున గౌరవ వేతనం
14. ఇమామ్‌లకు నెలకు రూ.10,000, మౌజన్లకు రూ.5,000 చొప్పున గౌరవ వేతనం
15. అర్చకులకు వేతనం నెలకు రూ.15,000కు పెంపు నాయీ బ్రాహ్మణులకు నెలకు రూ.25,000, జూనియర్ లాయర్లకు రూ.10,000 గౌరవ వేతనం చెల్లింపు
16. మెగా డీఎస్సీ : ముఖ్యమంత్రి తొలి సంతకం. 15,941 టీచర్ పోస్టుల భర్తీ
17. 5,757 కానిస్టేబుల్ పోస్టుల నియామకం పూర్తి. స్టైఫండ్ రూ.4,500 నుంచి రూ.12,500కు పెంపు
18. రాజముద్రతో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ రెవెన్యూ సదస్సులు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు.
19. అంగన్‌వాడి కార్యకర్తలు, ఆశాలకు గ్రాట్యుటీ అమలు - బాలింతలకు ఎన్టీఆర్ బేబీ కిట్లు
20. ప్రతీ నెలా 3వ శనివారం 'స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర'. పట్టణ ప్రాంతాల్లో 100 శాతం డోర్ టు డోర్ కలెక్షన్... ఇప్పటికి 105 లక్షల టన్నుల చెత్త తొలగింపు. చెత్తపన్ను రద్దు.
21. రాష్ట్ర వ్యాప్తంగా రూ.1,000 కోట్లతో రోడ్ల మరమ్మతులు. మరో రూ.3,000 కోట్లతో నూతన రహదారుల నిర్మాణం పల్లెపండుగ ద్వారా గ్రామాల్లో 4,000 కి.మీ. రోడ్ల నిర్మాణం
22 కొత్తగా 25 పాలసీలు - పరిశ్రమగా పర్యాటక రంగం గుర్తింపు పరిశ్రమలకు రాయితీల కోసం దేశంలో తొలిసారి ఎస్క్రో ఖాతాలు 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులకు శ్రీకారం
23. విశాఖ సీఐఐ సమ్మిట్ 610 ఒప్పందాలు. రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు, 16.13 లక్షల ఉద్యోగాలు
24. 14 ఎస్ఐపీబీ సమావేశాల్లో రూ.8.74 పెట్టుబడులకు ఆమోదం, 8.36 లక్షల ఉద్యోగాలు
25. విశాఖలో 15 బిలియన్ డాలర్లతో (రూ. 1.25 లక్షల కోట్లు) గూగుల్ ఎఐ డేటా సెంటర్ ఏర్పాటు
26. అమరావతిలో క్వాంటం వ్యాలీ భవనాలకు శంకుస్థాపన. విశాఖ ఐటీ హబ్, రిలయన్స్ డేటా సెంటర్‌కు అడుగులు, టీసీఎస్ ప్రారంభం, కాగ్నిజెంట్‌కు శంకుస్థాపన
27. కాకినాడలో ఏఎమ్ గ్రీన్ అమోనియా ప్రాజెక్టుకు శంకుస్థాపన. రెండేళ్లలో ఎగుమతులు
28. తిరుమల సహా దేవాలయాల సేవల్లో పెనుమార్పులు, 20కిపైగా ప్రధాన ఆలయాల్లో నిత్యాన్నదానాలు
29. విశాఖలో యోగాంధ్ర నిర్వహణ.., కర్నూలులో సూపర్ జీఎస్టీ సభ సక్సెస్
30. పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీల నిర్మాణం పేద విద్యార్థులకు అదనంగా 110 వైద్య విద్య సీట్లు
31. పంచాయతీ రాజ్ : రాష్ట్రమంతటా ఒకే రోజు 13,326 గ్రామ సభల నిర్వహణ, దాదాపు 3 వేల పనులకు శ్రీకారం... పంచాయతీ రాజ్ వ్యవస్థలో పదోన్నతులు, 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల. ప్రతీ ఇంటికి అమరజీవి జలధార పేరుతో మంచినీటి కుళాయి కనెక్షన్లు. రూ.3,050 కోట్లతో ప్రాజెక్టుకు రూపకల్పన, 1.21 కోట్ల మంది దాహార్తిని తీర్చాలని లక్ష్యం. అడవితల్లి బాటతో గిరిజన తండాలకు రోడ్ల నిర్మాణం, శివారు గ్రామాలకు 4జీ నెట్వర్క్
32. విద్యారంగం : విద్యా వ్యవస్థలో పెనుమార్పులు. మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ - గిన్నిస్ రికార్డ్. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, సర్వేపల్లి రాధాకృష్ణ కిట్స్, పారదర్శకంగా టీచర్ల బదిలీలు. విద్యార్థుల్లో పరిశుభ్రత పెంచేలా 'ముస్తాబు'
33. గేట్స్ ఫౌండేషన్, టాటాలతో సంజీవని ప్రాజెక్టు. యూనివర్సల్ హెల్త్ పాలసీ ప్రతిపాదనలు
34. గాడిన పడిన విద్యుత్ రంగం-విద్యుత్ చార్జీలు పెంచేది లేదని ప్రకటన - ట్రూ డౌన్ కింద యూనిట్‌కు రూ.0.13 పైసల చొప్పున తగ్గింపు, రూ.4,498 కోట్ల ట్రూ అప్ భారాన్ని భరిస్తున్న ప్రభుత్వం
35. రాష్ట్ర ఆర్థికాభివృద్ధి డబుల్ డిజిట్ గ్రోత్ 11.28 శాతం... పెరిగిన మూలధన వ్యయం
36. పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు ఉచితంగా స్థలం కోసం దరఖాస్తుల స్వీకరణ పూర్తి. 3 లక్షల ఇళ్లకు ఇప్పటికే గృహ ప్రవేశాలు. త్వరలో మరో 5 లక్షల ఇళ్ల ప్రారంభం.
37. ఉచిత ఇసుక పథకం అమలు. నాలా యాక్ట్ రద్దుతో పాటు నిర్మాణ రంగ అనుకూల నిర్ణయాలు
38. 20 లక్షల ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచితంగా సోలార్ రూఫ్ టాప్. బీసీలకు రూ.20 వేల అదనపు సాయం
39. తగ్గిన క్రైమ్ రేట్, గంజాయిడ్రగ్స్ అరికట్టాం, ఈగల్ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు.
40. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్, డేటా డ్రివెన్ డెసిషన్స్, వాట్సప్ గవర్నెన్స్ - మన మిత్ర ద్వారా 921 సేవలు
41. విశాఖపట్నం, అమరావతి, తిరుపతి కేంద్రంగా 3 రీజియన్ల అభివృద్ధికి కార్యాచరణ
42. పూర్వోదయ పథకంలో రాష్ట్రానికి దక్కిన చోటురాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధికి మరింత ఆస్కారం
43. విశాఖ రైల్వేజోన్ ప్రధాన కార్యాలయం పనులు ప్రారంభం
44. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు రూ. 11,440 కోట్ల కేంద్ర సాయం - నష్టాల నుంచి లాభాల బాట
45. దాదాపు 90 కేంద్ర పథకాల పునరుద్దరణ..కేంద్ర నిధుల సద్వినియోగం..పేద వర్గాలకు మేలు.
46. రాష్ట్రానికి రూ. 1 లక్ష కోట్ల విలువైన నేషనల్ హైవే ప్రాజెక్టులు, రైల్వే ప్రాజెక్టులు
47. కొత్తగా రెండు జిల్లాల ఏర్పాటు... 26 నుంచి 28కి పెరిగిన జిల్లాల సంఖ్య. రెవెన్యూ డివిజన్లు 81కి చేరాయి. మొత్తం మండలాల సంఖ్య 680కి చేరింది.
48. మహిళలకు లక్ష కుట్టు మిషన్ల పంపిణీకుప్పంలో 5,555 ఈ సైకిళ్లు (రూ.11 వేల సబ్సిడీ)
49. రికార్డ్ స్థాయిలో ధాన్యం సేకరణ, 24 గంటల్లో జమ. ఈ ఖరీఫ్ సీజన్లో 34.23 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ, 5.48 లక్షల మంది రైతులకు రూ.8,120 కోట్లు జమ.
50. మార్కెట్ ఇంటర్వెన్షన్ పొగాకు, మామిడి, కోకో, ఉల్లి సహా పంటలకు రూ.1,100 కోట్లకు పైగా సాయం
51. సమర్థ నీటి నిర్వహణతో 6.08 మీటర్లకు పెరిగిన భూగర్భ జలాలు (ఫిబ్రవరి, 2026)
52. సాగునీటి ప్రాజెక్టులకు ఈ 20 నెలల్లో రూ.23,793 కోట్లు ఖర్చు
53. హంద్రీనీవా పనులు పూర్తి చేసి సీమకు 43 టిఎంసిల తరలింపు
54. వెలిగొండ ప్రాజెక్టుకు రూ.571 కోట్లు వ్యయం - వేగంగా లైనింగ్, రిటైనింగ్ వాల్ పనులు
55. శరవేగంగా పోలవరం నిర్మాణం - 2027 పుష్కరాలకు పోలవరం ప్రారంభం
56. తుంగభద్ర గేట్ల మరమ్మతులకు ఏపీ వాటాగా రూ.55 కోట్ల కేటాయింపు
57. ధవళేశ్వరం, శ్రీశైలం, కండలేరు, మైలవరం, గుండ్లకమ్మ, గోరకల్లు, అవుకు వంటి ప్రాజెక్టులకు రూ.610 కోట్లతో మరమ్మతులు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.878 కోట్లతో కాలువల నిర్వహణ, పూడికతీత
58 నీటి భద్రత సమర్థ నీటి నిర్వహణతో పెరిగిన భూగర్భ జలాలు - 6,047 సాగునీటి సంఘాలకు ఎన్నికలు
59. కేంద్ర బడ్జెట్ లో రాష్ట్రం మీదుగా వెళ్లే 3 హై స్పీడ్ రైల్ కారిడార్ల కేటాయింపు60. ఆర్థిక కష్టాలు ఉన్నా ప్రభుత్వ ఉద్యోగులకు బకాయిలు, డిఏ, టిఏ, సరెండర్ లీవ్‌లు, బెనిఫిట్స్ చెల్లింపు. ఆరోగ్య శ్రీ సహా పెండింగ్‌లో ఉన్న బిల్లుల చెల్లింపు.



# డిజిటల్ సేవల పన్నులు ఇక ఉండవా?

**–భారత్ రద్దు చేస్తుందని అంటున్న అమెరికా**
**–అధికార ప్రకటనలో స్పష్టం చేయని మన దేశం**




ఇటీవల కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పందం కింద డిజిటల్ సేవల పన్ను (డీఎస్టీ)ను భారత్ తొలగిస్తుందని అమెరికా ప్రకటించింది. ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరిన వారం రోజుల తర్వాత ఈ ప్రకటన వెలువడింది. మన ప్రభుత్వ అధికారిక ప్రకటనలో మాత్రం ఈ విషయం లేదు. ఈ నేపథ్యంలోనే డిజిటల్ సేవల పన్నును మనదేశం ఎలా విధించింది, ఇప్పుడు ఏ మేరకు ఉపసంహరించుకుంటుంది అనే అంశాలను చూస్తే..

**--అమెరికా ప్రకటించింది ఇదీ...**వాణిజ్య ఒప్పందంపై ఫ్యాక్ట్ షీట్‌ను అమెరికా విడుదల చేసింది. డిజిటల్ సేవల పన్నులను భారత్ తొలగిస్తుందని అందులో పేర్కొంది. వివక్షపూరిత, భారమైన పన్నులను భారత్ తొలగించేలా చూసేందుకు చర్చలు జరుపుతున్నట్లూ వెల్లడించింది. ఎలక్ట్రానిక్స్ ట్రాన్స్‌మిషన్స్‌పై కస్టమ్స్ సుంకాలు విధించడాన్ని నిషేధించే నిబంధనలు కూడా ఉన్నాయి. వాణిజ్య ఒప్పందంపై భారత అధికార ప్రకటనలో డిజిటల్ సేవల పన్ను తొలగింపు గురించి స్పష్టంగా ప్రస్తావించలేదు. డిజిటల్ వాణిజ్యానికి అడ్డంకులను తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మాత్రమే తెలిపింది. ఒప్పందంలో భాగంగా డీఎస్టీని తొలగించనున్నట్లు చెప్పలేదు. మనదేశం ఇప్పటికే ఈక్వలైజేషన్ పన్నులను రద్దు చేసింది.

**--డిజిటల్ సేవల పన్నులు అంటే..**'డిజిటల్ సేవలు అందించడం ద్వారా ఒక దేశ వినియోగదారుల నుంచి విదేశీ కంపెనీలు ఆర్జించే ఆదాయంపై విధించే పన్నే' డిజిటల్ సేవల పన్ను. ఒక దేశంలో విదేశీ కంపెనీకి ఎటువంటి భౌతిక కార్యకలాపాలు లేకపోయినా, ఈ పన్ను వసూలు చేస్తారు. సాధారణంగా ఆన్‌లైన్ ప్రకటనలు, ఇకామర్స్ ప్లాట్‌ఫామ్‌లు, డిజిటల్ మార్కెట్‌ప్లేస్‌లు, ఇతర ఇంటర్నెట్ ఆధారిత సేవల వంటి వాటిపైనే ఈ పన్నులు ఉంటాయి. ఈ పన్నుల ప్రభావం ఎక్కువగా పడిన కంపెనీల్లో గూగుల్, మెటా, అమెజాన్, ఇతర పెద్ద టెక్నాలజీ ప్లాట్‌ఫామ్‌లు ఉన్నాయి. 2016 ఫైనాన్స్ చట్టం ద్వారా భారత్ ఈక్వలైజేషన్ పన్నులను తీసుకొచ్చింది. నాన్‌రెసిడెంట్ కంపెనీలతో పాటు కొన్ని డిజిటల్ లావాదేవీలపై ఈ పన్నులను విధించింది. ప్రారంభంలో భారత సంస్థలకు ఆన్‌లైన్ ప్రకటన సేవలు అందించే విదేశీ కంపెనీలపై వీటిని విధించారు. 2020 ఏప్రిల్‌లో ఇకామర్స్ సంస్థలు అందించే వస్తువులు, సేవలకు విస్తరించారు.

**--అమెరికా ఎందుకు వ్యతిరేకిస్తుందంటే..** మనదేశంలో విధిస్తున్న డిజిటల్ సేవల పన్నుల వల్ల, అమెరికా కంపెనీలపై భారం పడుతోందని 2021 జనవరిలో విడుదల చేసిన నివేదికలో యూఎస్‌టీఆర్ (అమెరికా వాణిజ్య ప్రతినిధి) పేర్కొంది. ఈ రంగంలోని భారత కంపెనీలకు మినహాయింపు ఇస్తూ, ఇతర దేశాల కంపెనీలపై పన్నులు విధించడం వివక్షతో కూడుకున్న చర్యగా అభివర్ణించింది. అంతర్జాతీయ పన్ను సూత్రాలకు ఇవి వ్యతిరేకమని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ పన్నుల వల్ల అమెరికా సంస్థలపై ఏటా 30 మి.డాలర్లకు పైగా పన్నుల భారం పడే అవకాశం ఉందని యూఎస్‌టీఆర్ అంచనా వేసింది. అయితే భారత్ ఇప్పటికే ఈక్వలైజేషన్ పన్నులను రద్దు చేసింది. అంతర్జాతీయ నిబంధనలకు అనుగుణంగా దేశీయ పన్ను విధానాలను తీసుకురావడం, ప్రధాన దేశాలతో వాణిజ్య ఒత్తిళ్లను తగ్గించుకునే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది.

**--లాభపడే కంపెనీలివే..**

పన్నుల తొలగింపుతో గూగుల్, మెటా, అమెజాన్ వంటి అమెరికా కంపెనీలు లాభపడనున్నాయి. భారత డిజిటల్ ప్రకటనల మార్కెట్‌లో ఈ కంపెనీల వాటా 65%. ఈ మార్కెట్ విలువ 5.82 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.52,000 కోట్లు). పన్నుల ఉపసంహరణతో ప్రకటనదారులపై ఎటువంటి అదనపు భారం ఉండదు, ఖర్చులు కూడా తగ్గుతాయి. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల మార్జిన్‌లు మెరుగుపడతాయి. ఈక్వలైజేషన్ పన్నులను తొలగించినప్పటికీ.. మన దేశంలో విదేశీ డిజిటల్ సంస్థలు పన్నుల పరిధిలోనే ఉన్నాయి. 2018లో సిగ్నిఫికెంట్ ఎకనామిక్ ప్రెజెన్స్ (ఎస్ఈపీ) నియమావళిని భారత్ తీసుకొచ్చింది. తద్వారా నాన్‌రెసిడెంట్ సంస్థలపై పన్నులు విధిస్తున్నారు. అదనంగా విదేశీ, దేశీయ డిజిటల్ సేవల ప్రొవైడర్లు 18% జీఎస్టీ చెల్లించాలి. స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్స్, క్లౌడ్ సేవలు, సాఫ్ట్‌వేర్ సబ్‌స్క్రిప్షన్స్, ఆన్‌లైన్ గేమింగ్, డిజిటల్ ప్రకటనలకు ఇది వర్తిస్తుంది. ఈ నియమావళి కింద నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్, అడోబ్, మైక్రోసాఫ్ట్ 365 వంటి సేవలు ఉన్నాయి.

# 'వీసా'మెత్తు భయమూ లేదు

**ఫీజు రెట్టింపైనా హెచ్-1బీ నియామకాలు కొనసాగుతాయ్**
**వేతన అంతరం, నిపుణుల కొరత వల్లే**
**ఎన్‌బీఈఆర్ నివేదిక**




అమెరికాలో విదేశీ నిపుణులు ఉద్యోగం చేసేందుకు అవసరమైన హెచ్1బీ కొత్త వీసా రుసుమును లక్ష డాలర్లు (రూ.90 లక్షలకు పైగా) చేసినా, కంపెనీలు తమకు అవసరమైన నిపుణుల నియామకాలను ఆపబోవని తాజా నివేదిక అంచనా వేస్తోంది. వీసా ఫీజును 1.5  2 లక్షల డాలర్లు చేసినా కూడా, అత్యున్నత నైపుణ్యం ఉన్న విదేశీ ఉద్యోగుల కోసం కంపెనీలు ముందడుగే వేస్తాయని తెలిపింది. అధునాతన నైపుణ్యాలున్న వారి కొరత అమెరికాలో అధికంగా ఉండడం ఇందుకు కారణమని వివరించింది. ఈ నివేదిక ప్రకారం..

**వేతన అంతరాలు ఇలా..**అమెరికాలో పుట్టిన ఉద్యోగులతో పోలిస్తే, హెచ్1బీ వీసాపై అక్కడకు వెళ్లే విదేశీ ఉద్యోగులకు తక్కువ వేతనాలే ఉన్నాయని అమెరికాకు చెందిన నేషనల్ బ్యూరో ఆఫ్ ఎకనమిక్ రీసెర్చ్ (ఎన్‌బీఈఆర్) నివేదిక తెలిపింది. ఒకటే ప్రాంతం, ఒకే తరహా విద్య, వయసు, లింగం, హోదా ఉన్న అమెరికా ఉద్యోగితో పోలిస్తే సగటు హెచ్1బీ ఉద్యోగికి 16% తక్కువ వేతనం లభిస్తోంది. హెచ్1బీ సిబ్బందికి కంపెనీని బట్టి వేతన స్థాయిలు ఉంటున్నాయి. మెటా, యాపిల్ వంటి దిగ్గజ సంస్థలు సగటున 1,50,000 డాలర్ల వార్షిక వేతనాలిస్తుండగా.. ఇన్ఫోసిస్, టీసీఎస్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్ వంటి భారతీయ ఐటీ కంపెనీలు 80,000 డాలర్ల వరకే ఇస్తున్నాయి. భారీ స్థాయి అమెరికా టెక్ కంపెనీల్లో మాత్రమే హెచ్1బీ ఉద్యోగికి, అమెరికాలో జన్మించిన ఉద్యోగికి మధ్య వేతన అంతరం చాలా తక్కువగా ఉంటోంది. మెటా, టెస్లాలో అయితే పెద్దగా అంతరమే లేదని అమెరికా వలస విధానాలపై సలహాలు ఇచ్చే ఆర్థికవేత్త జార్జ్ బోర్జాస్ రూపొందించిన 'హెచ్1బీ వేజ్ గ్యాప్, వీసా ఫీజ్ అండ్ ఎంప్లాయర్ డిమాండ్' నివేదిక చెబుతోంది.

**అగ్రగామి 25 కంపెనీలకు బయటే 75% మంది.....** హెచ్1బీ ఉద్యోగులేమీ పెద్ద కంపెనీల్లో అధిక స్థాయుల్లో కనిపించడం లేదు. అగ్రగామి 25 కంపెనీలకు బయటే వీరిలో 75% మంది పనిచేస్తుండడం గమనార్హం. ఐ129 డేటా ప్రకారం.. దాదాపు 46,184 కంపెనీలు కనీసం నాలుగేళ్లకు ఒక హెచ్1బీ ఉద్యోగిని నియమించుకుంటున్నాయి. సగటు ఇలా ఉన్నా.. 75 పర్సంటైల్‌లో ఉన్న కంపెనీలు మాత్రం ముగ్గురిని తీసుకున్నాయి. తక్కువ స్థాయిల్లో హెచ్1బీ సిబ్బందిని నియమించుకుంటున్న కంపెనీల్లోనూ, అమెరికా పౌరులకు వీరికి మధ్య వేతన అంతరం ఉంటోంది. ఒకే హెచ్1బీ నిపుణుడిని తీసుకున్న కంపెనీలు కూడా 18.5% తక్కువ వేతనాన్నే ఇస్తున్నాయి. పెద్ద కంపెనీల్లో చాలా తక్కువగా చేరిన హెచ్1బీ నిపుణులను మినహాయిస్తే.. ఈ వీసాపై వచ్చిన వారిలో చాలా మంది, అమెరికా పౌరుల కంటే తక్కువ జీతానికే పనిచేస్తున్నారు.

**వీరే ఎక్కువ..** హెచ్1బీ సిబ్బందిలో 38.3% మంది సాఫ్ట్‌వేర్ డెవలపర్లే ఉన్నారు. అగ్రగామి 5 హోదాల్లోనే మూడింట రెండొంతుల మంది పనిచేస్తున్నారు. తొలి 10 హోదాల వాటా 75 శాతంగా ఉంది. ఎందుకంటే అమెరికాలో జన్మించిన సిబ్బంది ఈ అధిక స్థాయి హోదాల వైపునకు వెళ్లడం లేదు. అంటే నైపుణ్యం ఉన్న వ్యక్తుల కొరత ఉంది.

**ఫీజు పెరిగితే కంపెనీలకు నష్టమా?....** హెచ్1బీ వీసాపై పనిచేసే ఒక ఉద్యోగికి ఇచ్చే వేతనాన్ని, అమెరికా పౌరులకు ఇచ్చే వేతనంతో పోలిస్తే, ఆరేళ్ల వ్యవధిలో సగటున లక్ష డాలర్ల వరకు కంపెనీలు ఆదా చేయొచ్చు. అంటే కొత్త ఫీజు చెల్లించాక కూడా కంపెనీలకు ప్రయోజనమే. అందుకే వీసా ఫీజును 1,50,0002,00,000 డాలర్లకు పెంచినా కూడా, హెచ్1బీ నియామకాలు ఆగకపోవచ్చని బోర్జాస్ అంచనా వేస్తున్నారు. కాకపోతే అత్యున్నత నిపుణులను మాత్రమే అమెరికాలోకి తీసుకు వచ్చేందుకు సంస్థలు సుముఖత చూపుతాయని వివరించారు.

# ఏఐ ప్లాన్‌కు సిద్ధంగా లేకపోతే.. స్వచ్ఛందంగా వెళ్లిపోవచ్చు: గూగుల్ ఆఫర్




కృత్రిమ మేధ అన్ని రంగాల్లోనూ శరవేగంగా విస్తరిస్తోంది. దానిని అందిపుచ్చుకునే క్రమంలో పలు సంస్థలు సిబ్బంది సంఖ్యలో కోతపెడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రముఖ టెక్ సంస్థ గూగుల్ తన ఉద్యోగులకు ఒక అవకాశం ఇచ్చింది. కంపెనీ ఏఐ ప్రణాళికలకు సిద్ధంగా లేనివారు.. స్వచ్ఛందంగా పదవీవిరమణ చేయొచ్చని సూచించింది. వారికి స్వచ్ఛంద నిష్క్రమణ ప్యాకేజీని ఆఫర్‌చేసింది. ఈ మేరకు గూగుల్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ ఫిలిప్ షిండ్లర్‌ను ప్రస్తావిస్తూ బిజినెస్ ఇన్‌సైడర్ కథనం పేర్కొంది. గ్లోబల్ బిజినెస్ ఆర్గనైజేషన్ (GBO)లోని కొందరు ఉద్యోగులకు ఈ ప్యాకేజీ వర్తించనుంది. గూగుల్‌లోని ఈ జీబీఓ యూనిట్.. సంస్థ ఉత్పత్తులు, సేవలకు సంబంధించిన ప్రకటనలు, గ్లోబల్ రెవెన్యూ గ్రోత్ (ప్రపంచవ్యాప్తంగా కంపెనీ ఆదాయం, అమ్మకాలు)ను పర్యవేక్షిస్తోంది. 2025 ఏడాదికి గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్ ఆదాయం 400 బిలియన్ డాలర్లు. 2026ను మెరుగ్గానే ఆరంభించినప్పటికీ.. ఏఐ పరిధి విస్తృతం అవుతోందని, దానిని అందిపుచ్చుకునేవారినే సంస్థ కోరుకుంటోందని షిండ్లర్ పేర్కొన్నారు. అమెరికాలోని కస్టమర్ సేల్స్ టీమ్స్, కస్టమర్ ఫేసింగ్ పొజిషన్స్ (నేరుగా కస్టమర్లతో సంప్రదింపులు జరిపే)కు ఈ ప్యాకేజీ వర్తించదని పేర్కొన్నారు. ఈ స్వచ్ఛంద నిష్క్రమణ అనేది గూగుల్ కే పరిమితం కాలేదు. ఇతర టెక్ సంస్థలు అమెజాన్, మెటా, మైక్రోసాఫ్ట్ ఇలాంటి ప్యాకేజీలను ప్రవేశపెట్టాయి. మైక్రోసాఫ్ట్ తన సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లకు అల్టిమేటం ఇచ్చినట్లు కథనాలు వెలువడ్డాయి.

**--రూ.2.9లక్షల కోట్లు సమీకరించిన గూగుల్..** ఏఐ కార్యక్రమాలను విస్తృతం చేసే లక్ష్యంతో ముందుకువెళ్తోన్న గూగుల్‌కు మార్కెట్‌లో భారీ మద్దతు లభించింది. నిధుల సమీకరణ కోసం అల్ఫాబెట్ జారీ చేసిన బాండ్లు మార్కెట్లో అదరగొట్టాయి. దాంతో సంస్థ 24గంటల్లో రూ.2.9 లక్షల కోట్లను సమీకరించింది.

# ఇదీ వాడకమంటే.. సోదరి కోసం జెప్టోను అలారమ్‌లా వాడిన సోదరుడు!




కొన్నేళ్ల క్రితం వచ్చిన ఓ సినిమాలో హీరో తన తల్లిని.. విలన్ నుంచి కాపాడడం కోసం స్విగ్గీ, జొమాటో, ఓలా, ఉబర్ డెలివరీ ఏజెంట్లను ఇంటికి పంపిస్తాడు. విలన్ పన్నాగానికి తన తెలివితేటలతో చెక్ పెడతాడు. అచ్చం ఆ సినిమా సీన్‌ను తలపించే ఘటన ముంబయిలో చోటుచేసుకుంది. తన సోదరి ఎక్కాల్సిన విమానం మిస్ అవ్వకుండా, ఆమె క్షేమ సమాచారం తెలుసుకునేందుకు ఓ వ్యక్తి సమయస్ఫూర్తితో జెప్టో ఆర్డర్ ను అలారమ్‌లా వినియోగించుకున్నాడు. దీనిపై జెప్టో కూడా స్పందించింది. ఇంతకీ ఏం జరిగిందంటే..? ముంబయికి చెంది రిషబ్ అగర్వాల్ పరేల్‌లో నివాసం ఉంటున్నారు. అతడి సోదరి పోవాయ్‌లో ఉంటున్నారు. ఉదయం 6 గంటలకు ఆమె విమానం ఎక్కాల్సి ఉంది. దీంతో ఆమెను వేకువజామున నిద్ర లేపాల్సిందిగా తన తల్లికి సూచించాడు. ఉదయం 3 గంటలకు తల్లి కాల్ చేస్తే సోదరి ఫోన్ స్విచ్ఛాఫ్ అని వచ్చింది. దీంతో కంగారుపడుతూ ఆమె రిషబ్‌కు విషయాన్ని తెలియజేసింది. అప్పటికప్పుడు తాను పోవాయ్ వెళ్లాలంటే కనీసం 40 నిమిషాలు పడుతుంది. అప్పుడే అతడికో ఆలోచన తట్టింది. వెంటనే ఆమె ఇంటికి జెప్టోలో కొన్ని సరకులు ఆర్డర్ పెట్టాడు. విషయాన్ని డెలివరీ బాయ్‌కి వివరించాడు. ఉదయం 3.20కి సరకులను ఆర్డర్ చేస్తే 3.30 గంటలకు డోర్ బెల్ కొట్టి డెలివరీ ఆమెకు సరకులు డెలివరీ చేశాడు. దీంతోపాటు ఆమె క్షేమ సమాచారాన్ని తెలియజేశాడు. దీంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. జరిగినదంతా రిషబ్ తన లింక్డిన్ పోస్ట్‌లో పేర్కొనడంతో అది వైరల్‌గా మారింది. "మేం అలారమ్ క్లాక్‌లు డెలివరీ చేస్తాం అనుకున్నాం గానీ, ఇలా అలారమ్ క్లాక్‌లా కూడా పనిచేస్తామని ఇప్పుడే తెలిసింది" అంటూ జెప్టో చీఫ్ బ్రాండ్ ఆఫీసర్ చందన్ చమత్కరించారు. డెలివరీ బాయ్‌పై కంపెనీ సీఓఓ వికాస్ శర్మ ప్రశంసలు కురిపించారు.

# మ్యూచువల్ ఫండ్లలో 'పసిడి' వెలుగులు

**—జనవరిలో రూ.24,000 కోట్ల పెట్టుబడులు: యాంఫీ**



దేశీయ మ్యూచువల్ ఫండ్ రంగంలో మునుపెన్నడూ లేని విధంగా పసిడి ఫండ్లలోకి పెట్టుబడులు వెల్లువెత్తాయి. భారతీయ మ్యూచువల్ ఫండ్ల సంఘం (యాంఫీ) విడుదల చేసిన నివేదిక ప్రకారం, ఈ ఏడాది జనవరిలో గోల్డ్ ఈటీఎఫ్ విభాగం రికార్డు వృద్ధిని నమోదు చేసింది. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో, స్టాక్‌మార్కెట్‌లో ఊగిసలాటలు నెలకొనడంతో, మదుపరులు పసిడిని సురక్షితమైన పెట్టుబడి మార్గంగా ఎంచుకున్నారని స్పష్టమవుతోంది.

**--వార్షికంగా 540% వృద్ధి...**గత నెలలో గోల్డ్ ఈటీఎఫ్‌లలోకి ఏకంగా రూ.24,039.96 కోట్ల నికర పెట్టుబడులు వచ్చాయి. 2025 డిసెంబరులో వచ్చిన రూ.11,647 కోట్ల పెట్టుబడులతో పోలిస్తే ఈమొత్తం 106% అధికం. వార్షిక ప్రాతిపదికన చూస్తే.. 2025 జనవరిలో గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి వచ్చిన పెట్టుబడులు రూ.3,751 కోట్లు మాత్రమే. దీంతో పోలిస్తే ఇప్పుడు ఏకంగా 540% వృద్ధిని నమోదు చేసింది. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలోకి జనవరిలో వచ్చిన నికర పెట్టుబడులు రూ.24,028 కోట్ల కంటే, పసిడి ఈటీఎఫ్‌ల్లోకి ఎక్కువగా రావడం విశేషం. వెండి ఈటీఎఫ్‌ల్లోకీ పెట్టుబడులు అధికంగానే వచ్చాయి.

**--రూ.81 లక్షల కోట్లకు మించి....**దేశీయ మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ జనవరి చివరికి మరో మైలురాయిని చేరింది. పరిశ్రమ నికర నిర్వహణ ఆస్తులు (నెట్ ఏయూఎం) రూ.81,01,305.58 కోట్లకు చేరాయి. 2025 డిసెంబరులో ఈ మొత్తం రూ.80,23,378.99 కోట్లుగా ఉంది. జనవరి నెలలో సగటు నిర్వహణ ఆస్తులు (ఏఏయూఎం) రూ.82,01,174.62 కోట్లుగా నమోదయ్యాయి.

**--పెరిగిన మదుపరుల ఆసక్తి...**

మ్యూచువల్ ఫండ్ ఖాతాల (ఫోలియో) సంఖ్య భారీగా పెరిగింది. జనవరిలో జతచేరిన 50.6 లక్షల ఫోలియోలతో కలిపి, మొత్తం ఫోలియోల సంఖ్య 26,63,13,561కు చేరింది. ఇందులో రిటెయిల్ మ్యూచువల్ ఫండ్ ఫోలియోలు 20.43 కోట్లుగా ఉన్నాయి. రిటెయిల్ విభాగం ఆస్తుల విలువ రూ.46,48,915 కోట్లుగా నమోదైంది.

**--సిప్.. జోరు...**క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్) ద్వారా వస్తున్న పెట్టుబడులు స్థిరంగా కొనసాగుతున్నాయి. జనవరిలో సిప్‌ల నుంచి రూ.31,002.33 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 2025 జనవరి నాటి రూ.26,400 కోట్లతో పోలిస్తే, ఇది 17% అధికం. మొత్తం మ్యూచువల్ ఫండ్లలో సిప్ వాటా 20.2 శాతంగా ఉంది. ప్రస్తుతం ఈ ఖాతాల సంఖ్య 9.92 కోట్లకు పైగా ఉంది.

**--సానుకూలంగానే..**2021 మార్చి నుంచి వరుసగా 59 నెలలోనూ ఈక్విటీ స్కీముల్లోకి సానుకూల పెట్టుబడులు వచ్చాయి. మొత్తం రూ.24,028.59 కోట్లలో ఫ్లెక్సీ క్యాప్ ఫండ్లు అత్యధికంగా రూ.7,672.36 కోట్లను ఆకర్షించాయి. పన్ను ఆదాకు ఉపయోగించే ఈఎల్ఎస్ఎస్ పథకాల నుంచి మదుపరులు రూ.593.69 కోట్లను వెనక్కి తీసుకున్నారు. జనవరిలో మొత్తం 12 కొత్త పథకాలు రాగా, వీటి ద్వారా రూ.1,939 కోట్లు సమకూరాయి. ఎస్ఐఎఫ్ (స్పెషలైజ్డ్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఫండ్) ఆస్తులు రూ.6,564 కోట్లకు చేరాయి. ఇందులోకి గత నెలలో రూ.1,729 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఈ సందర్భంగా యాంఫీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ వెంకట్ చలసాని మాట్లాడుతూ.. 'ప్రపంచ అనిశ్చితులు, స్వల్పకాలిక మార్కెట్ ఒడిదుడుకులున్నా, భారత మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ స్థిరమైన వృద్ధితో సాగుతోంది. హైబ్రిడ్, మల్టీ అసెట్, పాసివ్ ఫండ్లతో పాటు, బంగారం, వెండి ఈటీఎఫ్‌లలోకి వస్తున్న పెట్టుబడులు చూస్తే, మదుపరులు తమ పోర్ట్‌ఫోలియోను సమతుల్యం చేసుకుంటున్నారని తెలుస్తోంది' అని పేర్కొన్నారు.

# ఆకాశ ఎయిర్‌లైన్స్ సహ వ్యవస్థాపకుడు ప్రవీణ్ అయ్యర్ రాజీనామా




ఆకాశ ఎయిర్‌లైన్స్ సహ వ్యవస్థాపకుడు, చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ (CCO) ప్రవీణ్ అయ్యర్ తన పదవికి రాజీనామా చేశారు. దాదాపు ఐదేళ్లుగా ఆకాశ ఎయిర్‌లో కొనసాగుతున్న ఆయన కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవడంలో భాగంగా వైదొలుగుతున్నట్లు కంపెనీ ఓ ప్రకటనలో తెలిపింది. అధికారాలు, బాధ్యతలు సక్రమంగా బదిలీ జరిగేందుకు ఏప్రిల్ 30 వరకు ఆయన తన పదవిలో కొనసాగుతారని పేర్కొంది. ఆకాశ ఎయిర్ నుంచి ఉన్నత స్థాయి వ్యక్తులు వైదొలగడం ఇటీవల కాలంలో ఇది రెండోది. మరో సహ వ్యవస్థాపకురాలు నీలు ఖత్రి గతేడాది అక్టోబర్‌లో రాజీనామా చేశారు. 2022 ఆగస్టు 7న ఆకాశ ఎయిర్‌లైన్స్ ప్రారంభమైంది. సంస్థ వ్యవస్థాపకుడు వినయ్ దుబె సీఈఓగా వ్యవహరిస్తున్నారు. అయ్యర్ రాజీనామాతో ప్రస్తుతం నలుగురు సహ వ్యవస్థాపకులు మిగిలారు. ఆకాశ ఎయిర్‌లైన్స్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుల్లో ఒకరైన అయ్యర్ వైదొలగడంతో.. చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్‌గా ఉన్న ఆదిత్య చీఫ్ కమర్షియల్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. దీంతో చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ పదవికి అర్హులైన అభ్యర్థుల కోసం ఆకాశ ఎయిర్ అన్వేషణ మొదలుపెట్టింది. ఆకాశ ఎయిర్‌లైన్స్ నిర్మాణంలో అయ్యర్ కీలక పాత్ర పోషించారని ఈ సందర్భంగా సీఈఓ వినయ్ దుబె పేర్కొన్నారు. ఆకాశ ఎయిర్ ప్రస్తుతం 33 బోయింగ్ 737 మ్యాక్స్ విమానాలను నడుపుతోంది. 2024 25 ఆర్థిక సంవత్సరానికి విమానయాన సంస్థలు మొత్తంగా కలిపి రూ.5,289.73 కోట్ల నష్టాన్ని ప్రకటించగా.. ఆకాశ ఎయిర్‌కు రూ.1986.25 కోట్ల నష్టం వచ్చినట్లు కేంద్రం ఇటీవల రాజ్యసభకు తెలిపింది. అలాగే, గడిచిన రెండేళ్లలో విమానయాన సంస్థలకు 352 షోకాజ్ నోటీసులు జారీ చేయగా.. అందులో 17 ఆకాశ ఎయిర్ అందుకుంది.

## ‘స్వయంభు’ అందరి అంచనాలు అందుకుంటుంది: సంయుక్త



‘స్వయంభు’ కోసం నిఖిల్ చాలా కష్టపడ్డారని నటి సంయుక్త అన్నారు. నిఖిల్ ప్రధానపాత్రలో భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా లో సంయుక్త, నభా నటేశ్ కథానాయికలుగా కనిపించనున్నారు. తాజాగా ఈ మూవీ టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సంయుక్త మాట్లాడుతూ.. నిఖిల్‌పై ప్రశంసలు కురిపించారు. ‘స్వయంభు’ కోసం దర్శకుడు చాలా రీసెర్చ్ చేశారని తెలిపారు. ఆయన కథ చెప్పినప్పుడు తాను ఆశ్చర్యపోయినట్లు చెప్పారు. రెండేళ్ల నుంచి ఈ సినిమా విడుదల కోసం అందరూ ఎదురుచూస్తున్నారని.. అందరి అంచనాలకు తగినట్లే భారీ స్థాయిలో విడుదలవుతుందని వెల్లడించారు.

## ఓటీటీలోకి వరుణ్ సందేశ్ క్రైమ్ థ్రిల్లర్.. ‘కానిస్టేబుల్’ ట్రైలర్ చూశారా!




వరుణ్ సందేశ్ హీరోగా నటించిన క్రైమ్ థ్రిల్లర్ మూవీ ‘కానిస్టేబుల్’ . ఈ సినిమా ఓటీటీ ‘ఈటీవీ విన్’ లో ఈ నెల 29 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా సదరు సంస్థ ట్రైలర్‌ను బుధవారం విడుదల చేసింది. ఆర్యన్ సుభాస్ ఎస్కే తెరకెక్కించిన ఈ చిత్రం గతేడాది అక్టోబరులో విడుదలైంది. మధులిక వారణాసి హీరోయిన్. మురళీధర్ గౌడ్, రవివర్మ తదితరులు కీలక పాత్రలు పోషించారు.

**--ఈ సినిమా కథేంటంటే?:** శంకరపల్లి గ్రామం చుట్టూ తిరిగే కథ ఇది. ఆ ఊరిలో చాలామంది హత్యకు గురి అవుతూ ఉంటారు. అక్కడ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్ పని చేసే కాశీ (వరుణ్ సందేశ్) మేనకోడలినీ హత్య చేస్తారు. అసలు ఆ మర్డర్స్ చేసిందెవరు? సీరియల్ కిల్లర్‌ను కాశీ ఎలా పట్టుకున్నాడు? అన్నది మిగతా కథ.

## ‘క’ దర్శకులతో సాయితేజ్



రెండేళ్లుగా ‘సంబరాల ఏటిగట్టు’ సినిమాతోనే ప్రయాణం చేస్తున్నారు కథానాయకుడు సాయిదుర్గాతేజ్. భారీ స్థాయిలో రూపొందుతున్న ఆ చిత్రం తుదిదశకు చేరుకోవడంతో, ఇప్పుడు ఆయన కొత్త సినిమాని ఆరంభించడానికి సిద్ధమయ్యారు. ‘క’ సినిమాతో విజయాన్ని అందుకున్న దర్శకద్వయం సుజిత్, సందీప్ చెప్పిన కథకు సాయిదుర్గా తేజ్ పచ్చజెండా ఊపారు. ఈ కలయికలో సినిమా ఉగాది రోజున ప్రారంభం కానున్నట్టు సమాచారం. ‘మన శంకరవరప్రసాద్‌గారు’తో విజయాన్ని అందుకున్న షైన్ స్క్రీన్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించనుంది.

## సందీప్ వంగా మాటలు స్ఫూర్తినింపాయి


శ్రేయాసి, సౌమిత్

సౌమిత్ పోలాడి, శ్రేయాసి సేన్ హీరోహీరోయిన్లుగా తెరకెక్కిన చిత్రం ‘నిలవే’. హర్ష చెముడు, సుప్రియా ఐసోలా కీలకపాత్రల్లో నటించారు. సాయి కె.వెన్నంతో కలిసి హీరో ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. రాజ్ అల్లాడ, గిరిధర్ రావు పోలాడి, సాయి సంయుక్తంగా నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 13న రానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గాయని సునీత ముఖ్య అతిథిగా విచ్చేసి ట్రైలర్‌ని ఆవిష్కరించారు. సౌమిత్ మాట్లాడుతూ... ‘నేను సినిమాల్లోకి వెళ్తున్నానంటే మా నాన్న చాలా సపోర్ట్ చేశారు. నన్ను హీరో దర్శకుడిగా మార్చింది సాయి కే వెన్నెం’ అని తెలిపారు. ‘‘ఇది మంచి కంటెంట్ ఉన్న సినిమా. దర్శకుడు సందీప్ రెడ్డిని కలిసినప్పుడు ‘ఇక్కడ ఎవరూ క్రిస్టోఫర్ నోలన్ లేరు. మన సినిమాని మనమే నమ్మాలి’ అన్నారు. ఆ మాటలే నాలో స్ఫూర్తిని నింపాయి’’అన్నారు దర్శకుడు సాయి. ఈ కార్యక్రమంలో నిర్మాత మాధురి, నటి సత్య శ్రీ, ప్రవీణ కడియాల తదితరులు పాల్గొన్నారు.

## ఫంకీలో.... కయాదు లోహర్



వరుస చిత్రాలతో అలరిస్తోన్న కథానాయిక కయాదు లోహర్. గతేడాది ‘డ్రాగన్’ మూవీతో అలరించిన ఈ భామ.. ఈ వాలెంటైన్స్ డేన ‘ఫంకీ’తో వినోదాన్ని పంచడానికి సిద్ధమైంది. ఈ సందర్భంగా కయాదు ముచ్చట్లు మీకోసం.. సినిమా నేపథ్యం లేదు.. గాడ్‌ఫాదర్లూ లేరు. అయినా కూడా నటనపై ఆసక్తితో పుణె నుంచి వచ్చి దక్షిణాదిలో వాలిపోయింది కయాదు లోహర్. సీన్ కట్ చేస్తే.. తెలుగు, తమిళ, కన్నడ, భాషల్లో వరుస సినిమాలు చేస్తోంది.కయాదు నటించిన వాణిజ్య ప్రకటనలు చూసి దర్శకుడు భరత్ నవుండా నుంచి పిలుపు రావడంతో ‘ముగిల్‌పేట్’ అనే కన్నడ చిత్రంతో తెరంగేట్రం చేసింది.ముగిల్‌పేట్ విడుదల కాకముందే ‘పతోన్‌పాతమ్ నూట్టాండు’ అనే మలయాళ చారిత్రక సినిమాలో సంతకం చేసింది. ఇది భారీ ప్రాజెక్టు. ఇందులో కయాదు నటనకి మంచి మార్కులే పడ్డాయి. చూడటానికి సాఫ్ట్‌గా ఉన్నా కయాదు అల్లరి పిల్ల. కాలేజీలో తనకో పెద్ద గ్యాంగ్ ఉండేది. తరగతులు డుమ్మా కొట్టి సినిమాలకు చెక్కేసిన సందర్భాలు ఉన్నాయట.‘పుణె టైమ్స్ ఫ్రెష్ ఫేస్’గా ఎంపికైంది. అంగద్ దేశ్‌పాండే అనే కుర్రాడితో ప్రేమలో ఉందనే వార్తలతోపాటు ఆ జంట ఫొటోలూ అంతర్జాలంలో షికార్లు చేస్తున్నాయి.తెలుగులో ‘అల్లూరి’ అడుగు పెట్టింది. మన భాషపై పట్టు సాధించడానికి బాగానే కసరత్తులు చేసింది. చీరకట్టులో తెలుగు పడుచుగా నిండుగా కనిపించింది.నచ్చే నటులు: నాని, అల్లు అర్జున్, అలియా భట్..ఇష్టమైన పాత్ర: గంగూభాయ్ కాఠియావాడిఖాళీగా ఉంటే దూరప్రయాణాలు చేయడం, బైక్ రైడింగ్ సరదా అని చెబుతుంటుంది. కయాదు అంటే.. భక్త ప్రహ్లాదుడి తల్లిపేరు2026లో ఆమె ఏకంగా ఎనిమిది సినిమాల్లో పనిచేస్తోంది. ‘ఫంకీ’ త్వరలో విడుదల కానుండగా, నానితో ‘ది ప్యారడైజ్’, ‘ఇన్ గేమ్’, ‘ఇదయం మురళి’, ‘ఎస్టీఆర్49’, ‘పల్లిచట్టంబి’, ‘తరామ్’ తదితర చిత్రాలు ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్నాయి.

## ఓటీటీలోకి ‘అనగనగా ఒక రాజు’.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే?

ఈ ఏడాది సంక్రాంతికి థియేటర్లలో విడుదలైన సినిమాల్లో ‘అనగనగా ఒక రాజు’ ఒకటి. ఈ మూవీ ఓటీటీ రిలీజ్ డేట్ ఖరారైంది. ఈనెల 11 నుంచి ‘నెట్‌ఫ్లిక్స్’ (Netflix)లో స్ట్రీమింగ్ కానుంది. గోదావరి నేపథ్యంతో కామెడీ ఎంటర్‌టైనర్‌గా వచ్చిన ‘అనగనగా ఒక రాజు’ పండగ సినిమా అనిపించుకుంది. తన కామెడీ టైమింగ్ ఎలాంటిదో హీరో నవీన్ పొలిశెట్టి ఈ చిత్రంతో మరోసారి నిరూపించారు. ఆయనకు జోడీగా నటించిన మీనాక్షీ చౌదరి అందం, అభినయంతో ఆకట్టుకున్నారు. ఈ మూవీలో చమ్మక్ చంద్ర, ‘సంక్రాంతికి వస్తున్నాం’ ఫేమ్ బుల్లిరాజు, రావు రమేశ్ తదితరులు సందడి చేశారు. దర్శకుడు మారి తెరకెక్కించిన ఈ సినిమా జనవరి 14న విడుదలైన సంగతి తెలిసిందే. రూ.100+ కోట్లు కలెక్ట్ చేసిన సందర్భంగా.. హీరో నవీన్‌కు ప్రొడ్యూసర్ నవీన్ ఎర్నేని తాజాగా కంగ్రాట్స్ చెప్పారు. తమ కాంబినేషన్‌లో మరో మూవీ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా అని తెలిపారు.

**--ఈ సినిమా కథేంటంటే?....** గౌరవపురం జమీందార్ గోపరాజు మనవడు రాజు (నవీన్ పొలిశెట్టి). జమీందార్ మనవడు అనే పేరు తప్ప ఆస్తులేమీ మిగలకపోవడంతో ఆర్థిక కష్టాలతో సతమతమవుతూ, పగటి కలలు కంటూ కాలం గడుపుతుంటాడు. బాగా డబ్బున్న కుటుంబానికి చెందిన అమ్మాయిని పెళ్లి చేసుకుంటే జీవితంలో స్థిరపడిపోవచ్చనే నిర్ణయానికొస్తాడు. చారులత (మీనాక్షి)ని చూశాక ఆమే తన రాణి అయితే కష్టాలన్నీ గట్టెక్కేయొచ్చని భావించి, ఆమె మనసుని గెలచుకోవాలని రంగంలోకి దిగుతాడు. మరి, చారులత మనసుని ఎలా గెలిచాడు? ఆమె జీవితంలోకి వచ్చాక రాజు కష్టాలు తొలగిపోయాయా? రాజు రాజకీయాల్లోకి అడుగుపెట్టాల్సిన అవసరం ఎందుకొచ్చింది? అన్నదే మిగతా కథ.




## దేశాల్లో నం.1.. పది రోజుల్లో 16 మిలియన్ల వ్యూస్: ఓటీటీలోనూ ‘ధురంధర్’ హవా

ఇండస్ట్రీలోసంచలనం సృష్టించిన చిత్రం ‘ధురంధర్’. దాదాపు రెండు నెలలు థియేటర్‌లలో సందడి చేసి బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించిన ఈ చిత్రం.. ఇప్పుడు ఓటీటీలోనూ హవా చూపిస్తోంది. గతేడాది డిసెంబర్‌లో విడుదలైన ‘ధురంధర్’.. జనవరి 30న నెట్‌ఫ్లిక్స్ వేదికగా డిజిటల్ ప్రేక్షకుల ముందుకు అందుబాటులోకి వచ్చింది. స్ట్రీమింగ్‌కు వచ్చిన తొలిరోజు నుంచే వ్యూస్‌లో సత్తా చూపిస్తూ పలు రికార్డులను సొంతం చేసుకుంటోంది. పదిరోజుల్లో ఈ సినిమాకు దాదాపు 16 మిలియన్ల వ్యూస్ (15.9) వచ్చినట్లు నెట్‌ఫ్లిక్స్ తెలిపింది. మొదటి మూడు రోజుల్లోనే 7.6మిలియన్ల వ్యూస్‌తో గ్లోబల్ టాప్10 నాన్ ఇంగ్లీష్ ఫిల్మ్స్ జాబితాలో నెం.1 స్థానంలో నిలిచిన ‘ధురంధర్’. ఫిబ్రవరి 2 నుంచి 8 వరకూ 8.2 మిలియన్ల వ్యూస్‌ను తన ఖాతాలో వేసుకుంది. ఏకంగా 11 దేశాల్లో నం.1 స్థానంలో కొనసాగుతోంది. తొలిభాగం సూపర్ హిట్ కావడంతో చిత్రబృందం రెట్టింపు ఉత్సాహంతో రెండో పార్ట్‌ను విడుదల చేసేందుకు సిద్ధమైంది. మొదటి భాగానికి మించి ఇది విజయం సాధిస్తుందనే నమ్మకం ఉందని నిర్మాత జ్యోతి దేశ్‌పాండే ఇటీవల ఓ ఇంటర్వ్యూలో



తెలిపారు. అందుకే ఐదు భాషల్లో ఒకేసారి విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. తొలి చిత్రానికి కొనసాగింపుగా ‘ధురంధర్2’ రెడీ అవుతోంది. మార్చి 19న ఈ చిత్రాన్ని విడుదల కానుంది. ఇటీవల విడుదల చేసిన టీజర్ పార్ట్2పై అందరినీ ఆకట్టుకున్న విషయం తెలిసిందే.

## ‘కార్తికేయ 2’.. తర్వాత అందుకే గ్యాప్ తీసుకున్నా: నిఖిల్

తన కెరీర్‌లో ఎన్నో ఒడుదొడుకులు వచ్చాయన్నారు హీరో నిఖిల్. ఆయన ప్రధానపాత్రలో భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో రూపొందుతున్న పాన్ ఇండియా సినిమా ‘స్వయంభు’ . సంయుక్త, నభా నటేశ్ కథానాయికలు. తాజాగా దీని టీజర్‌ను విడుదల చేశారు . ఈ సందర్భంగా నిఖిల్ మాట్లాడుతూ.. చిత్రకథ గురించి తెలిపారు. ‘‘నేను రెండేళ్లు ఎవరికీ కనిపించలేదు. ఆ సమయంలో కూడా మీడియా వాళ్లు ఎంతో సపోర్ట్ చేశారు. ‘హ్యాపీ డేస్’ వచ్చి 19 సంవత్సరాలు అవుతోంది. ఇన్నేళ్ల నా కెరీర్‌లో ఎన్నో ఒడుదొడుకులు ఉన్నాయి. కానీ, అందరూ నాకు సపోర్ట్ చేశారు. ‘కార్తికేయ 2’ లాంటి గొప్ప సినిమా చేసిన తర్వాత దానికంటే అద్భుతమైన ప్రాజెక్ట్‌తో పలకరించాలని ఇన్ని రోజులు ఆగాను. చాలా శ్రద్ధతో, భయంగా జాగ్రత్తలు తీసుకుంటూ చేసిన సినిమా ‘స్వయంభు’. ఈ మూవీ చూసిన తర్వాత నిఖిల్ మావాడు అని చెప్పడానికి మీరంతా గర్వపడతారు’’ ‘‘మనదేశంలో ఈరోజు మనమంతా ఇంత స్వేచ్ఛగా ఉండడం వెనక ఎంతోమంది త్యాగాలు ఉన్నాయి. అందరూ పెద్దపెద్ద రాజుల గురించి మాట్లాడతారు కానీ.. ప్రాణ త్యాగాలు చేసిన యోధుల గురించి మాట్లాడుకోరు.



1000ఏళ్ల క్రితం మన రాయలసీమ ప్రాంతంలో కృష్ణ అనే యోధుడు ఉన్నాడు. అతడి కథ ఇది. అల్లరిగా తిరిగే అతడు ఎలా యోధుడిగా మారాడు.. రాజ్యాలను శాసించే స్థాయికి ఎలా ఎదిగాడు అనేది ఇందులో చూపించాం. నిజంగా జరిగిన కథ’’ అని నిఖిల్ తెలిపారు.

## ఇక డాక్టర్ శ్రీలీల.. ఎంబీబీఎస్ పూర్తి చేసిన నటి



డాక్టర్ కాబోయి యాక్టర్ అయిన వారు చాలామంది ఉన్నారు. కానీ, నటిగా రాణిస్తూనే శ్రీలీల (Sree Leela) ఎంబీబీఎస్ పూర్తి చేశారు. తాజాగా వైద్య పట్టా అందుకున్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అభిమానులు, పలువురు నెటిజన్లు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

**--అందుకే డాక్టర్ కావాలనుకున్నారు..**

తమ ఇంట్లో జరిగిన ఓ సంఘటన కారణంగానే డాక్టర్ కావాలని నిర్ణయించుకున్నారు శ్రీలీల. ‘‘మా అమ్మమ్మ ఉన్నట్టుండి పడిపోయింది. అప్పుడు ఏం చేయాలో మాకు అర్థం కాలేదు. వైద్యుడైన మా అన్నయ్య వచ్చి, చిన్నపాటి వైద్యం చేశాక కొన్ని క్షణాల్లోనే ఆమె మామూలు స్థితిలోకి వచ్చింది. వైద్యురాలిని కావాలని అప్పుడే ఫిక్స్ అయిపోయా’’ అని ఓ సందర్భంలో తెలిపారు. శ్రీలీల తల్లి స్వర్ణలత కూడా వైద్యురాలే. అనుకోకుండానే సినిమాల్లోకి వచ్చినా.. డాక్టర్‌గా సేవ చేయాలన్న సంకల్పాన్ని వదల్లేదు. వరుస చిత్రాలతో బిజీగా గడుపుతూనే ఏమాత్రం ఖాళీ సమయం దొరికినా చదువుకే కేటాయించేవారు. 2019లో కన్నడ సినిమా ‘కిస్’తో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చిన శ్రీలీల.. ‘పెళ్లి సందD’తో 2021లో టాలీవుడ్‌కి పరిచయం అయ్యారు. తర్వాత, అగ్ర హీరోల సినిమాల్లో నటించి అనతి కాలంలో స్టార్‌గా మారారు. ఆమె డ్యాన్స్‌కూ ప్రత్యేక అభిమానగణం ఉండటం గమనార్హం. ఇటీవల ‘పరాశక్తి’లో రత్నమాలగా కనిపించిన ఆమె.. పవన్ కల్యాణ్ సరసన ‘ఉస్తాద్ భగత్‌సింగ్’లో నటిస్తున్నారు.

# అభిషేక్.. బహుపరాక్!




2024లో భారత జట్టు టీ20 ప్రపంచ కప్ గెలిచాక దిగ్గజ ఆటగాళ్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ ఒకేసారి టీ20లకు టాటా చెప్పేశారు. వాళ్లిద్దరూ మిగిల్చిన ఖాళీతో ఒక్కసారిగా జట్టు కళ తప్పినట్లయింది. ఆటల్లో ఏ జట్టుకైనా స్టార్ క్రీడాకారులే ఆకర్షణ. వాళ్ల ఆట చూడాలనే అభిమానులు మైదానాలకు వస్తారు. టీవీల ముందూ కూర్చుంటారు. కోహ్లి, రోహిత్‌ల నిష్క్రమణతో టీ20 జట్టు ఈ ఆకర్షణే కోల్పోయింది. కానీ కొన్ని నెలలు తిరిగేసరికే అభిషేక్ శర్మ అనే కుర్రాడు అభిమానుల దృష్టిని తన వైపు తిప్పుకొన్నాడు. తన ఆట కోసమే మ్యాచ్‌లు చూసేలా చేశాడు. టీ20 జట్టులో అతనే ఇప్పుడు పెద్ద స్టార్. కానీ అతడీ స్థాయిని నిలబెట్టుకోవాలన్నా.. కోహ్లి, రోహిత్‌ల్లా సూపర్‌స్టార్‌గా ఎదగాలన్నా కొంచెం జాగ్రత్తగా అడుగులు వేయడం అవసరం. ప్రస్తుత భారత టీ20 జట్టుకు బ్యాటింగ్‌లో అతి పెద్ద బలం అభిషేక్ శర్మనే అనడంలో భిన్నాభిప్రాయాలు లేవు. అతను క్రీజులో కుదురుకున్నాడంటే ప్రత్యర్థి జట్లకు హడలే. బౌలర్లపై నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడుతూ, అలవోకగా భారీ షాట్లు ఆడుతూ మ్యాచ్‌ల ఫలితాలను శాసించే ఆటగాడతను. కెరీర్ ఆరంభంలో సగటు ఆటగాడిలాగే కనిపించాడు. ఆచితూచి ఆడేవాడు. కానీ ఐపీఎల్ అవసరాలకు తగ్గట్లు తన బ్యాటింగ్‌ను విధ్వంసక శైలికి మార్చుకోవడంతో లీగ్‌లో విలువైన ఆటగాళ్లలో ఒకడిగా ఎదిగాడు. ఐపీఎల్ మెరుపులు భారత టీ20 జట్టులో చోటూ తెచ్చిపెట్టాయి. రెండో మ్యాచ్‌లోనే సెంచరీ కొట్టేయడంతో ఇక అతను వెనుదిరిగి చూడాల్సిన పని లేకపోయింది. గత ఏడాది కాలంలో జట్టులో అతడి ప్రాధాన్యం, అభిమానుల ఆదరణ అమాంతం పెరిగిపోయాయి. 39 టీ20ల్లో 36 సగటుతో 1297 పరుగులు చేశాడు అభిషేక్. అందులో 2 శతకాలు, 8 అర్ధశతకాలు ఉన్నాయి. ఈసారి టీ20 ప్రపంచకప్‌లోనే అత్యంత ఆకర్షణీయ ఆటగాళ్లలో అతనొకడు. అభిషేక్ నిలిస్తే.. మ్యాచ్ గెలిచినట్లే, అతను నిలకడగా ఆడితే భారత్‌కు మరో ప్రపంచకప్ చేజిక్కినట్లే అనే స్థాయిలో అంచనాలు నెలకొన్నాయి. కానీ ఓ జట్టుకు అతి పెద్ద బలంగా మారిన ఆటగాడి మీద ప్రత్యర్థి జట్లు కన్నేయకుండా ఉంటాయా? వేస్తున్నాయి.

అతడి కోసం ప్రత్యేకంగా ప్రణాళికలు రచిస్తున్నాయి. ఇటీవల కొన్ని మ్యాచ్‌ల్లో అతను ప్రత్యర్థుల ప్రణాళికలను తిప్పికొట్టాడు. కొన్నిసార్లు మాత్రం ఉచ్చులో పడ్డాడు. ఈ రోజుల్లో టీ20 బ్యాటర్లు తొలి బంతి నుంచే భారీ షాట్లకు దిగుతున్నారు. అభిషేక్‌ది కూడా అదే శైలి. ఏ దశలోనూ అతను దూకుడు తగ్గించడు. ప్రత్యర్థి జట్లకు ఊపిరి సలపనివ్వకుండా షాట్లు కొడుతూనే ఉంటాడు. ఇలా కొన్ని మ్యాచ్‌ల్లో తన మెరుపు ఇన్నింగ్స్‌లతో ఆరంభంలోనే మ్యాచ్ ఫలితాలను నిర్దేశిస్తున్నాడు. కానీ ఒక మ్యాచ్ చెలరేగితే.. ఇంకో మ్యాచ్‌లో వెంటనే ఔటవుతున్నాడు. చివరి అయిదు మ్యాచ్‌ల్లో మూడుసార్లు తొలి బంతికే వికెట్ సమర్పించుకున్నాడు అభిషేక్. గత నెల న్యూజిలాండ్‌తో తొలి టీ20 35 బంతుల్లోనే 84 పరుగుల విధ్వంసక ఇన్నింగ్స్ ఆడి జట్టును గెలిపించాడు. కానీ తర్వాతి మ్యాచ్‌లో తొలి బంతికే డకౌటయ్యాడు. మూడో టీ20లో 155 పరుగుల లక్ష్యాన్ని భారత్ 10 ఓవర్లకే ఛేదించిందంటే అందుకు ప్రధాన కారణం ఈ కుర్రాడే. ఆ మ్యాచ్‌లో 20 బంతుల్లోనే 68 పరుగులు కొట్టేశాడు. కానీ మరుసటి మ్యాచ్‌లో మళ్లీ తొలి బంతికే వెనుదిరిగాడు. తాజాగా టీ20 ప్రపంచకప్ ఆరంభ పోరులోనూ అమెరికాపై తొలి బంతికే వికెట్ ఇచ్చేశాడు. అమెరికా జట్టు ముందే ఒక వ్యూహం ప్రకారం అతణ్ని ఔట్ చేసిందని స్పష్టమైంది. షార్ట్ పిచ్ బంతులకు 'వి' కోణంలో షాట్లు ఆడే ప్రయత్నం చేస్తాడు అభిషేక్. బంతి ఆఫ్‌సైడ్ పడితే కవర్స్‌లో, లెగ్ సైడ్ పడితే మిడ్ వికెట్‌లో బౌండరీ కోసం ప్రయత్నిస్తాడు. అలీఖాన్ కవర్స్‌లో షాట్ ఆడేలా అతణ్ని ప్రేరేపించాడు. బౌండరీ వద్ద ఫీల్డర్‌ను పెట్టడంతో అభిషేక్ అతడికి చిక్కాడు.

దీంతో పాటు క్రీజు వదిలి బయటికి వచ్చి షాట్ ఆడే క్రమంలో కొన్నిసార్లు అభిషేక్ బ్యాట్ ఎడ్జ్ తీసుకుని స్లిప్, థర్డ్ మ్యాన్‌లో క్యాచ్‌లు లేస్తున్నాయి. కివీస్ బౌలర్లు కూడా ఈ బలహీనతను ఉపయోగించుకునే అతణ్ని రెండుసార్లు డకౌట్ చేయగలిగారు. అభిషేక్ కొంచెం తన ఆటనే కాక దృక్పథాన్నీ మార్చుకోవాల్సిన అవసరం కనిపిస్తోంది. ప్రతి జట్టులోనూ ప్రత్యర్థి ఆటగాళ్ల ఆటను విశ్లేషించడానికి ఒక బృందం పని చేస్తుంది. వీడియో విశ్లేషకుల సాయంతో.. ఆటను ఆమూలాగ్రం చదివేస్తారు. దీని ఆధారంగా వ్యూహాలు రూపొందిస్తారు. మ్యాచ్ ఫలితాలనే తారుమారే చేసే ఆటగాడు కావడంతో అభిషేక్ ఆట మీద ప్రత్యర్థి జట్లు దృష్టిసారిస్తున్నాయి. కొన్ని మ్యాచ్‌ల్లో అతను ఔటవుతున్న తీరే అందుకు నిదర్శనం. బౌలింగ్ మీద ఒక అంచనాకు రాకుండా, ఫీల్డింగ్ ఏర్పాట్లను గమనించకుండా గుడ్డిగా షాట్లు ఆడడం మానుకోవాలి. శైలి మార్చుకోవడం, దూకుడు తగ్గించడం అవసరం లేదు కానీ.. కొన్ని బంతులను గౌరవించాలి, క్రీజులో ఎక్కువసేపు గడిపేందుకు ప్రయత్నించాలి. ఒక ఆటగాడు బాగా ఆడుతున్నపుడు ఆకాశానికెత్తేసే వాళ్లే.. కొన్ని వైఫల్యాలు ఎదురైతే నిర్దాక్షిణ్యంగా కిందపడేస్తారు. కాబట్టి బలహీనతలను అధిగమించడం, కొత్త అస్త్రాలను సిద్ధం చేసుకోవడం అవసరం. వ్యూహాలకు ప్రతివ్యూహాలు పన్నితేనే ఆటలో అత్యున్నత స్థాయి సాధ్యం. ఈ విషయంలో సచిన్, కోహ్లి లాంటి మేటి ఆటగాళ్ల అడుగుజాడల్లో అభిషేక్ నడవాలి. ప్రస్తుతం అభిషేక్ జట్టులో ఆధారపడదగ్గ ఆటగాడిగా మారాడు. అతణ్ని ఔట్ చేస్తే భారత్‌ను ఒత్తిడిలోకి నెట్టొచ్చని ప్రత్యర్థి జట్లు చూస్తున్నాయి. కాబట్టి అప్రమత్తత అవసరం. ప్రపంచకప్‌పై అభిషేక్ తనదైన ముద్ర వేయగలిగితే భారత క్రికెట్ కొత్త సూపర్ స్టార్‌గా ఎదిగే అవకాశముంటుంది

# ముకేశ్‌కు మరో 2 పతకాలు




ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో తెలుగు కుర్రాడు ముకేశ్ నేలవల్లి మరో రెండు పతకాలు సాధించాడు. జూనియర్ పురుషుల 25 మీటర్ల వ్యక్తిగత ర్యాపిడ్ ఫైర్ పిస్టల్‌లో ముకేశ్ కాంస్య పతకంతో మెరిశాడు. టీమ్ విభాగంలో ముకేశ్, సూరజ్ శర్మ, సాహిల్ చౌదరి బృందం బంగారు పతకం కైవసం చేసుకుంది. ఈ టోర్నీలో ముకేశ్ నాలుగు విభాగాల్లో ఏడు పతకాలకు పోటీపడి ఆరు నెగ్గాడు

# టీ20 వరల్డ్ కప్ 2026.. మాట మార్చిన బంగ్లాదేశ్!




బంగ్లాదేశ్ క్రీడా సలహాదారు ఆసిఫ్ నజ్రుల్ తన మాట మార్చారు. ఇంతకుముందు భారత్‌లో భద్రత కారణాలను సాకుగా చూపి.. తమ మ్యాచ్‌లను శ్రీలంకకు తరలించాలని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డ్ (BCB), ఐసీసీ (ICC) మీద ఒత్తిడి తీసుకు వచ్చిన విషయం తెలిసిందే. కానీ భారత్‌లో అలాంటి పరిస్థితులు లేకపోవడంతో ఐసీసీ ఒప్పుకోలేదు. దీంతో బంగ్లాదేశ్ మెగాటోర్నీ నుంచి వైదొలగింది. ఈ నేపథ్యంలో.. ఐసీసీ, ఆ స్థానంలో స్కాట్లాండ్‌కు అవకాశం కల్పించింది. అయితే తాజాగా ఆసిఫ్ నజ్రుల్ గతంలో తాను చేసిన వ్యాఖ్యలపై యూటర్న్ తీసుకున్నారు. 'జాతీయ గౌరవాన్ని కాపాడటం కోసం' ఈ నిర్ణయాన్ని క్రికెట్ బోర్డు, ఆటగాళ్లు తీసుకున్నారన్నారు. 'ప్రభుత్వం ఈ నిర్ణయం ఎందుకు తీసుకోవాల్సి వచ్చిందో ఆటగాళ్లకు వివరించడమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశం. ఐసీసీ మాకు న్యాయం చేస్తుందని మేము అనుకోవడం లేదు. మేం ప్రపంచకప్‌లో ఆడతామా.. లేదా.. అనేది పూర్తిగా మా ప్రభుత్వ నిర్ణయం మీద ఆధారపడి ఉంటుంది' అని ఆయన జనవరి 22న విలేకరులతో అన్నారు. అయితే గతంలో చేసిన వ్యాఖ్యలకు పూర్తి విరుద్ధంగా మంగళవారం ఆయన మాట్లాడటం గమనార్హం. 'ప్రపంచ కప్ ఆడకపోవడంపై మాకు ఎటువంటి చింత లేదు. దేశభద్రత, జాతీయ గౌరవాన్ని కాపాడటం కోసం బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డ్, ఆటగాళ్లు ఈ నిర్ణయం తీసుకున్నారు' అని ఆసిఫ్ విలేకరులతో అన్నారు. అలాగే ఈ విషయంలో బంగ్లాదేశ్‌పై చర్యలుండబోవని ఐసీసీ ప్రకటించిన విషయం తెలిసిందే.

## అది నా వాయిస్ కాదు.. ఏఐ వాడి మార్చారు ..బీసీసీఐ ఉపాధ్యక్షుడు



టీ20 ప్రపంచ కప్ లో భారత్‌తో మ్యాచ్ బహిష్కరిస్తామని బెదిరించిన పాకిస్థాన్.. ఐసీసీ జోక్యంతో దారికొచ్చిన సంగతి తెలిసిందే. షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 15న కొలంబోలో టీమ్‌ఇండియాతో మ్యాచ్ ఆడతామని పాక్ ప్రకటించింది. చర్చల ద్వారా వచ్చిన ఫలితంతో సంతృప్తి చెందడంతో పాటు మిత్ర దేశాలు విజ్ఞప్తి చేయడంతో భారత్‌తో మ్యాచ్ ఆడేందుకు తమ జట్టుకు అనుమతి ఇస్తున్నట్లు పాకిస్థాన్ ప్రభుత్వం పేర్కొంది. పాక్ మీడియాలో మాత్రం ఇందుకు భిన్నమైన ప్రచారం జరుగుతోంది. పాకిస్థాన్‌కు చెందిన ఓ టీవీలో ఛానెల్ క్రికెట్ షోకు ఆ దేశ మాజీ ఆటగాడు షోయబ్ మాలిక్ హోస్ట్‌గా ఉన్నాడు. సదరు ఛానెల్‌లో బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా పాక్‌తో మ్యాచ్ గురించి మాట్లాడిన వీడియోను ప్రసారం చేశారు. భారత్‌తో ఆడేందుకు పాక్‌ను ఒప్పించాలని ఐసీసీపై బీసీసీఐ ఒత్తిడి తెచ్చిందని శుక్లా అన్నట్లుగా ఆ వీడియోలో ఉంది. ఇది సోషల్ మీడియాలో వైరల్ అవడంతో బీసీసీఐ ఉపాధ్యక్షుడు స్పందించారు. తాను ఆ వ్యాఖ్యలు చేయలేదని, ఏఐని ఉపయోగించి తన వాయిస్‌ని మార్చారని పేర్కొన్నారు. ''భారత్, పాక్ టీ20 ప్రపంచ కప్ మ్యాచ్ గురించి నేను మాట్లాడాను. ఏఐని ఉపయోగించి ఆడియోను మార్చారు. ఈ వ్యాఖ్యలు నేను చేయలేదు. ఇలా తప్పుదోవ పట్టించే కంటెంట్‌ను నమ్మవద్దని ప్రతి ఒక్కరినీ కోరుతున్నా. ఇలాంటి వీడియోలను సర్క్యులేట్ చేయొద్దు. వీటిని ఎక్కడ చూసినా రిపోర్ట్ కొట్టండి'' అని రాజీవ్ శుక్లా ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు.

## టీ20 వరల్డ్ కప్.. ఇంగ్లాండ్‌పై వెస్టిండీస్ విజయం



టీ20 ప్రపంచ కప్ 2026లో వెస్టిండీస్ రెండో విజయం అందుకుంది. వాంఖడే వేదికగా ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో కరేబియన్ జట్టు 30 పరుగుల తేడాతో విజయం సాధించింది. 197 పరుగుల టార్గెట్‌తో బరిలోకి దిగిన ఇంగ్లిష్ జట్టు 19 ఓవర్లలో 166 పరుగులకు ఆలౌటైంది. ఇంగ్లాండ్ బ్యాటర్లలో సామ్ కరన్ (43*; 30 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్. జాకబ్ బెథెల్ (33), ఫిల్ సాల్ట్ (30), జోస్ బట్లర్ (21), హ్యారీ బ్రూక్ (17) పరుగులు చేశారు. టామ్ బాంటన్ (2), విల్ జాక్స్ (2) విఫలమయ్యారు. విండీస్ బౌలర్లలో గుడాకేష్ మోటి 3, రోస్టన్ ఛేజ్ 2, రొమారియో షెఫర్డ్, అకీల్ హోస్సేన్, షమర్ జోసెఫ్ తలో వికెట్ పడగొట్టారు. తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. ఐదో స్థానంలో వచ్చిన షెర్ఫాన్ రూథర్‌ఫోర్డ్ (76*; 42 బంతుల్లో 2 ఫోర్లు, 7 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. రోస్టన్ ఛేజ్ (34; 29 బంతుల్లో 6 ఫోర్లు), జేసన్ హోల్డర్ (33; 17 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్స్‌లు), షిమ్రోన్ హెట్‌మయర్ (23; 12 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. విండీస్ చివరి 9 ఓవర్లలో 113 పరుగులు రాబట్టడం విశేషం.

## కంగారూలు.. ఎట్టకేలకు

### –నేడు ఐర్లాండ్‌తో తొలి పోరు




టీ20 ప్రపంచకప్ మొదలై నాలుగు రోజులు గడిచిపోయింది. మిగతా జట్లన్నీ మైదానంలోకి అడుగు పెట్టేశాయి. న్యూజిలాండ్, పాకిస్థాన్, నెదర్లాండ్స్, స్కాట్లాండ్, అమెరికా జట్లు రెండేసి మ్యాచ్‌లు ఆడేశాయి. కానీ టైటిల్ ఫేవరెట్లలో ఒకటైన ఆస్ట్రేలియా మాత్రం ఇంకా బరిలోకే దిగలేదు. ఈ మాజీ ఛాంపియన్.. ఎట్టకేలకు బుధవారం తన తొలి మ్యాచ్‌ను ఆడబోతోంది. తమ ఆరంభ పోరులో ఆతిథ్య శ్రీలంక చేతిలో పోరాడి ఓడిన ఐర్లాండ్‌ను.. కంగారూ జట్టు ఢీకొనబోతోంది. ఈ జట్లున్న గ్రూప్‌సిలో మ్యాచ్‌లన్నీ కొలంబోలోనే జరగనున్న సంగతి తెలిసిందే. స్పిన్‌కు బాగా అనుకూలించే ఈ వేదికలో ఆస్ట్రేలియా.. ఇద్దరు స్పెషలిస్టు స్పిన్నర్లు ఆడమ్ జంపా, మాథ్యూ కునెమన్‌లతో పాటు స్పిన్ ఆల్‌రౌండర్లు మ్యాక్స్‌వెల్, కూపర్ కనోలీలను తుది జట్టులో ఆడించే అవకాశముంది. కెప్టెన్ మిచెల్ మార్ష్, ట్రావిస్ హెడ్‌లకు తోడు గ్రీన్, ఇంగ్లిస్, డేవిడ్, స్టాయినిస్, మ్యాక్స్‌వెల్‌లతో ఆ జట్టు బ్యాటింగ్ ఎంతో బలంగా కనిపిస్తోంది. ఎలిస్, బార్ట్‌లెట్ కొత్త బంతిని పంచుకుంటారు. మరోవైపు ఐర్లాండ్.. స్టిర్లింగ్, హ్యారీ టెక్టార్, టక్కర్, మార్క్ అడైర్, మెకార్తీలపై ఆశలు పెట్టుకుంది. బుధవారం మిగతా రెండు మ్యాచ్‌ల్లో దక్షిణాఫ్రికాతో అఫ్గానిస్థాన్, ఇంగ్లాండ్‌తో వెస్టిండీస్ తలపడతాయి.

## పాక్ కాదు.. ఐసీసీనే వెనక్కి తగ్గింది ..పీసీబీ మాజీ ఛైర్మన్ నజమ్ సేథీ




పూటకో మాట మార్చడం పాక్‌కు పరిపాటే. ఈ విషయాన్ని పాకిస్థాన్ క్రికెట్ బోర్డ్ (PCB) మాజీ ఛైర్మన్ నజమ్ సేథీ మరోసారి నిరూపించారు. నిన్న మొన్నటి వరకు భారత్‌తో మ్యాచ్ ఆడబోమని బీరాలకు పోయిన పాకిస్థాన్.. ఆఖరుకు ఐసీసీతో (ICC) కాళ్ల బేరానికి దిగిన విషయం తెలిసిందే. మ్యాచ్ ఆడకుంటే.. చర్యలు తప్పవంటూ ఐసీసీ హెచ్చరించడంతో చివరకు పాక్ వెనక్కి తగ్గింది. అందరూ ఊహించినట్లుగానే యూ టర్న్ తీసుకుంది. అయితే ఈ విషయంలో పాక్ వెనక్కి తగ్గలేదని, ఐసీసీనే ఆ పని చేసిందని పీసీబీ మాజీ ఛైర్మన్ నజమ్ సేథీ వక్రభాష్యం చెప్పారు. ''నిజానికి ఐసీసీనే వెనక్కి తగ్గింది. బంగ్లాదేశ్ విషయంలో కాస్త సానుకూలంగా వ్యవహరించింది. ఈ అంశంలో పాకిస్థాన్ చాలా ఆలోచించి నిర్ణయం తీసుకుంది. భారత్‌తో మ్యాచ్ ఆడకుంటే ఎటువంటి ఆంక్షలుండవని పాక్‌కు తెలుసు. ఈ విషయంపై వారు స్వదేశం, విదేశాల్లో అగ్రశ్రేణి న్యాయవాదులను సంప్రదించారు'' అని సేథీ ఓ ఆంగ్లమీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. ''పాకిస్థాన్ బలమైన స్థానంలో ఉంది. మహా అయితే ఒక పాయింట్ కోల్పోతుంది. అంతకు మించి ఇంకేమీ జరగదు. ఇదే విషయాన్ని ఐసీసీ కూడా గ్రహించిందని అనుకుంటున్నా. అందుకే అది ప్రతిపాదనలు చేసింది. ఐసీసీ డిప్యూటీ ఛైర్మన్ ఇమ్రాన్ ఖవాజా రంగంలోకి దిగారు. ఆయనే భారత్‌తో మ్యాచ్ ఆడాలని పాకిస్థాన్‌కు వచ్చి చర్చలు జరిపారు'' అని సేథీ పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌కు మద్దతుగా టీ20 వరల్డ్ కప్ 2026లో (ICC Mens T20 World Cup) భారత్‌తో పాక్ మ్యాచ్ ఆడబోదని పీసీబీ తొలుత ప్రకటించింది. ఈ నిర్ణయాన్ని పునరాలోచించాలని మెగాటోర్నీ సహఆతిథ్య దేశమైన శ్రీలంక.. పాక్‌ను కోరింది. గతంలో తాము పాకిస్థాన్‌లో ఉగ్రదాడి జరిగిన తర్వాత కూడా మ్యాచ్‌లు ఆడామని గుర్తు చేసింది. భారత్, పాక్ మ్యాచ్ జరగకుంటే కొన్ని వేలకోట్ల రూపాయల ఆదాయం నష్టపోయే ప్రమాదముంది. దీంతో ఐసీసీ సభ్యదేశాలన్నీ పాక్‌పై ఒత్తిడి తెచ్చాయి. ఈ నేపథ్యంలో శ్రీలంక మాట వినకుంటే.. మొదటికే మోసం వస్తుందని, తాము ఒంటరిగా మిగిలిపోతామని పాకిస్థాన్ భయపడింది. చివరికి తన మొండితనాన్ని వీడి భారత్‌తో మ్యాచ్‌కు అంగీకరించింది. పైకి మాత్రం ఇదంతా తమ కోసం కాదని.. కేవలం బంగ్లాదేశ్ కోసమే చేశామని చెప్పుకొచ్చింది.

## భారత్‌తో పోటీ పాక్‌కు తేలిక కాదు ..సౌరభ్ గంగూలీ



పొట్టి ప్రపంచకప్‌లో భారత్‌తో తాము మ్యాచ్ ఆడబోమని మొదట పాకిస్థాన్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఐసీసీ (ICC) హెచ్చరికలకు తలొగ్గి చివరికి యూటర్న్ తీసుకుంది. ఈ అంశంపై బీసీసీఐ (BCCI) మాజీ అధ్యక్షుడు సౌరభ్ గంగూలీ మాట్లాడారు. రాజకీయాలు, క్రీడలు వేరన్నారు. చివరకు పాకిస్థాన్ సరైన నిర్ణయం తీసుకుందన్నారు. అయితే టీమ్‌ఇండియాను ఓడించడం అంత సులువు కాదన్నారు. 'చర్చల గురించి నాకు తెలియదు. కానీ వారు భారత్‌తో ఆడతామని మంచి నిర్ణయం తీసుకున్నారు. క్రీడలు, రాజకీయాలు వేరు. భారత్, పాక్ మ్యాచ్‌లు ఎప్పుడూ ఆసక్తిగా ఉంటాయి. అయితే కొన్ని సంవత్సరాలుగా పాకిస్థాన్ పెద్దగా పోటీ ఇవ్వడం లేదు. భారత్ అద్భుతమైన జట్టు. టీమ్‌ఇండియాను ఓడించడం పాక్‌కు అంత తేలికైన విషయం కాదు' అని సౌరభ్ గంగూలీ అన్నారు.

### --పాకిస్థాన్ యూటర్న్ తీసుకుంటుందని అప్పుడే చెప్పాం ...హర్భజన్ సింగ్

భారత్‌తో మ్యాచ్ విషయంలో పాకిస్థాన్ యూటర్న్ తీసుకుంటుందని ఎప్పుడో చెప్పామని టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ అన్నాడు. 'తాము లేకున్నా వరల్డ్ కప్ జరుగుతుంది. కానీ భారత్ లేకుండా జరగదు అని వారు (పాక్) చాలా ఆలస్యంగా తెలుసుకున్నారు. పాకిస్థాన్ యూటర్న్ తీసుకుంటుందని, భారత్‌తో మ్యాచ్ ఆడుతుందని.. మేమంతా ముందు నుంచి చెబుతూనే ఉన్నాం. ఒక వేళ పాకిస్థాన్ ఆడకుంటే.. భారీగా నష్టపోతుంది. అందుకోసమే వారు ఆడతామనే వేడుకుంటారు. ప్రస్తుతం జరిగింది అదే. ఒక వేళ వారు భారత్‌తో మ్యాచ్ ఆడకుండా ఉంటే.. ఐసీసీ తీవ్రమైన చర్యలు తీసుకునేది. అందుకే పాక్ తన నిర్ణయం మార్చుకుంది' అని హర్భజన్ సింగ్ అన్నాడు.

## బెంగాల్ చేతిలో ఆంధ్ర ఓటమి

### –రంజీ ట్రోఫీలో ముగిసిన పోరాటం

రంజీ ట్రోఫీలో ఆంధ్ర పోరాటం ముగిసింది. బెంగాల్‌తో క్వార్టర్‌ఫైనల్లో ఆ జట్టు ఓటమి పాలైంది. మంగళవారం ముగిసిన మ్యాచ్‌లో బెంగాల్ ఇన్నింగ్స్, 90 పరుగుల ఆధిక్యంతో ఆంధ్రను చిత్తు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 64/3తో అయిదో రోజు ఉదయం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర.. 72.2 ఓవర్లలో 244 పరుగులకు ఆలౌటైంది. నితీశ్‌కుమార్‌రెడ్డి (90; 144 బంతుల్లో 7×4, 2×6), త్రిపురణ విజయ్ (46; 61 బంతుల్లో 6×4, 2×6) పోరాడినా ఫలితం లేకపోయింది. బెంగాల్ బౌలర్లలో షాబాజ్ అహ్మద్ (4/72) మెరిశాడు. తొలి ఇన్నింగ్స్‌ల్లో ఆంధ్ర 295.. బెంగాల్ 629 పరుగులకు ఆలౌటయ్యాయి.